

డోలీలో ఆస్పత్రికి..!
- 9 కిలోమీటర్ల మేర పాట్లు

2

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 290 | విజయవాడ, శనివారం 24 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 24 may 2025 | Rs


కేరళ ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న విజయన్ తదితరులు

నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ
- ఎల్‌డిఎఫ్ 4వ వార్షికోత్సవ వేడుకల్లో పినరయి విజయన్

7

డిఎస్‌సి యథాతథం

వాయిదా వేయాలనే పిటిషన్లు కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో డిఎస్‌సి వాయిదా కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏవైనా సమస్యలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచించింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు డిఎస్‌సి పరీక్షలు యథాతథంగా జరగనున్నాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిఎస్‌సి, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జరుగుతాయనిసుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది.డిఎస్‌సి, టెట్ పరీక్షల షెడ్యూల్‌ను వాయిదా వేయాలని అభ్యర్థిస్తూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం, అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో తగిన కారణాలు కనిపించడం లేదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం, జూన్ 6 నుంచి జులై 6 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) పద్ధతిలో డిఎస్‌సి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 30న హాల్‌టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.

అమరావతిని నోటిఫై చేయండి

- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి
- సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతిని రాష్ట్ర రాజధానిగా విభజన చట్టంలో చేర్చి నోటిఫై చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను ఆయన శుక్రవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలను ఆయన వారి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో తమ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తో జరిపిన భేటీలో అమరావతి అంశాన్ని ప్రస్తావించినట్లు , విభజన చట్టంలో సవరణ చేయడానికి ఆయన అంగీకరించారని సిఎం చెప్పారు. అనంతపురంలో ఉన్న ఆర్‌డిటి సంస్థకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు.

బకాయిలు విడుదల చేయండి

రాష్ట్రానికి ఉండే ఆర్థిక సమస్యలన్నీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చంద్రబాబు చెప్పారు. ఆర్థికంగా పుంజుకోవడానికి నిధులు ఇవ్వాలని, బకాయిలను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. పేర్కొన్నారు. పోలవరం - బనకచర్లకు ఆర్థికసాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. 'పిఎం సూర్యఘర్' పథకం అమలుకు రాష్ట్రానికి అనుమతి ఇవ్వాలని కూడా కోరినట్లు చెప్పారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు రాష్ట్రం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు.


కేంద్రహోం మంత్రి అమిత్‌షాకు మెమొంటో అందజేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

అంతరిక్ష సాంకేతికత సలహాదారుగా సోమనాథ్ కావాలి

రాష్ట్రానికి అంతరిక్షసాంకేతిక సలభాదారునిగా ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్‌ను నియమించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ జితేంద్ర సింగ్ ను సిఎం కోరారు. ఈ నియమాకం రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో పోటీపడటానికి దోహదం చేస్తుందని తెలిపారు. అదే సమయంలో షార్, లేపాక్షిల వద్ద నిర్మించతలపెట్టిన స్పేస్ సెంటర్ల గురించి కూడా మంత్రికి వివరించారు.

కేంద్రం అనుమతి ఇవ్వగానే బనకచర్ల

కేంద్రం అనుమతి ఇవ్వగానే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ప్రారంభిస్తామని విలేకరుల సమావేశంలో సిఎం తెలిపారు. అంతకుముందు కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను సిఎం చంద్రబాబు కలిశారు. ఈ సమావేశంలో 200 టిఎంసిలకు సంబంధించిన పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు . పోలవరం పనులు ఫాస్ట్ ట్రాక్ లో జరుగుతున్నాయని,. పునరావాసం మొత్తం కేంద్రమే ఇవ్వాల్సి ఉందని అన్నారు. ఉంటుందన్నారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, టిడిపి, బిజెపి ఎంపిలు ఉన్నారు.

పదేళ్లు కావాలి...

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. తిరిగి 'గాడిలో పెట్టాలంటే కనీసం పదేళ్ల సమయం కావాలి. ఆర్థిక వెసులుబాటు లేకుండా చేశారు. ఒకపక్క దాదాపు రూ. 1.20 లక్షల కోట్ల బిల్లుల బకాయిలు, రూ. 9.94 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. అందుకే ప్రజలు శిక్షించారు.అమరావతి, పోలవరం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కి ప్యాకేజీ తీసుకొచ్చి పునరుద్ధరణ చేయడం, విశాఖపట్నం రైల్వే జోన్ వంటివి చేయగలిగాం. ఇంకా చాలా చేయాలి' అని బాబు అన్నారు.



భారత్‌పై మరోసారి ట్రంప్ అక్కసు

- ఐఫోన్లపై 25 శాతం సుంకాలు
- ఇయుపైనా టారిఫ్‌ల దాడి

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు భారత్‌పై అక్కసును వెళ్లగక్కారు. భారత్‌లో తయారు చేస్తోన్న ఐఫోన్లపై భారీగా సుంకాలను పెంచారు. అమెరికా మినహాయించి ఇతర దేశాల్లో తయారు చేసిన ఐఫోన్‌లను తమ దేశంలో అమ్మితే 25 శాతం టారిఫ్ విధిస్తామని స్పష్టం చేశారు. 'నేను చాలా కాలం క్రితమే ఈ విషయాన్ని ఆపిల్ సిఇఒ టిమ్‌కుక్ చెప్పాను. అమెరికాలో అమ్మే ఐఫోన్లను అమెరికాలోనే తయారు చేయాలని, విదేశాల్లో కాదని. భారత్‌తోపాటు మరే ఇతర దేశంలోనైనా తయారు చేసిన ఐఫోన్లను ఇక్కడ అమ్మితే వాటిపై ఆపిల్ కంపెనీ అమెరికాకు కనీసం 25 శాతం టారిఫ్ చెల్లించాల్సిందే.' అని తన సొంత సోషల్ మీడియా ట్రూత్ సోషల్ వేదికగా ఓ పోస్టులో పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఆపిల్ అధికారికంగా స్పందించాల్సి ఉంది. అమెరికా, చైనా మధ్య నెలకొన్న వాణిజ్య ఆందోళనల నేపథ్యంలో ఆపిల్ కంపెనీ భారత్‌లో ఐఫోన్ల తయారీని పెంచాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ హెచ్చరికలు భారత్‌కు గొడ్డలిపెట్టుగా మారనున్నాయని భావిస్తున్నారు.

యూరోపియన్ యూనియన్ (ఇయు) దేశాలపైకూడా భారీ టారిఫ్‌లను విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఆయా దేశాలపై 50 శాతం సుంకం విధిస్తామని స్పష్టం చేశారు. కొత్త టారిఫ్‌లు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఇయుతో జరిపిన చర్చలు ఫలవంతం కాలేదన్నారు. చర్చలు నిలిచినందున అధిక సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ - 2లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మళ్లీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్ - 2 (ఎస్ఎంఎస్) విభాగంలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ కమ్మేయడంతో ఉద్యోగులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఓ ఆయిల్ పైపులైన్ పగిలి పక్కనే ఉన్న కేబుల్స్ మీద పడడంతో మంటలు చెలరేగాయని ప్లాంట్ ఉన్నతాధికారులు చెప్పారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను నియంత్రించారని, ఉత్పత్తికి కాసేపు అంతరాయం కలిగిందని తెలిపారు. ఆస్తి నష్టంపై అధికారులు అంచనాలు రూపొంది స్తున్నారు. నాలుగు రోజుల క్రితం స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ - 2లో ప్రమాదం జరిగి పెద్ద మొత్తంలో లిక్విడ్ స్టీల్ నేలపాలైన విషయం తెలిసిందే. వారం రోజుల వ్యవధిలో జరిగిన ఈ రెండు ఘటనలు ప్లాంట్‌లోని నిర్వహణా లోపాలను పట్టిచూపుతున్నాయి.

కార్మికులను తొలగించడం, ప్లాంట్‌ను నిర్వీర్యం దిశగా నడపడం వల్లే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.


ఎస్ఎంఎస్ - 2 విభాగంలో ఎగిసిపడుతున్న మంటలు

అతివేగానికి ఆరుగురు బలి

- లారీని ఢీకొన్న కారు
- మృతులంతా స్టూవర్టుపురం వాసులు


అంకాలు దివాకర్ నరసింహ జోసెఫ్ సన్నీ

ప్రజాశక్తి- కొమరోలు (ప్రకాశం జిల్లా), అమరావతి బ్యూరో

అతి వేగం ఆరుగురి ప్రాణాలను తీసింది. లారీని ఇన్నోవా కారు ఢీకొనడంతో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద అమరావతి-కడప జాతీయ రహదారిలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన గజ్జల అంకాలు (50), మొగిలి భవాని (23), గజ్జల నరసింహ (25), గజ్జల జోసెఫ్ (55), బొచ్చు సన్నీ (27), కర్రెద్దుల దివాకర్ (27), గజ్జల సిద్ధార్థ, గజ్జల సిరి అనే చిన్నారులతో కలిసి ఈ నెల 20న శ్రీశైలం, మహానంది ఇతర క్షేత్రాలను సందర్శించేందుకు ఇన్నోవా కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అతివేగంగా వస్తూ యూటర్న్ తీసుకునే క్రమంలో బేస్తవారిపేట నుండి వస్తున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని అంకాలు, భవాని, నరసింహ, జోసెఫ్, దివాకర్, సన్నీ అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారులు సిద్ధార్థ, సిరి గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. గాయాలపాలైన చిన్నారులను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జెసిబి సాయంతో ఇన్నోవా కారును రోడ్డు పక్కకు తీశారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది.

స్టూవర్టుపురంలో తీవ్ర విషాదం

రోడ్డు ప్రమాదంలో ఆరుగురి మృతితో స్టూవర్టుపురంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వీరంతా ప్రతి ఏడాదీ ఆలయాలను సందర్శించేందుకు వెళు తుంటారని,ఈసారీ వెళ్లారని, తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందని గ్రామస్తులు తెలిపారు.

చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్టూవర్టుపురానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ప్రమాదానికి కారణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బెట్టింగ్ యాప్‌లపై కేంద్రానికి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీబ్యూరో



బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై శుక్రవారం జరిగిన విచారణలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ దాఖలు చేసిన పిల్ (పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్) ఆధారంగా ఈ విచారణ జరిగింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని లేదా నియంత్రించాలని కోరుతూ కెఎ పాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ యాప్‌ల ద్వారా జూదం ప్రోత్సహించబడుతోందని, యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆయన తన వాదనలో పేర్కొన్నారు. ఈ కేసును జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్‌కె సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వాలకూ నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేసింది.

ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు

- వామపక్షాల తీవ్ర ఖండన ... న్యాయవిచారణకు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఆపరేషన్ కగార్ పేరిట చత్తీస్‌ఘడ్, బస్తర్ అడవుల్లో మోడీ సర్కారు కొంత కాలంగా సాగిస్తున్న పోలీసు కాల్పుల మారణకాండలో భాగంగా జరిగిన తాజా నారాయణపూర్ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు' వామపక్షాలు తెలిపాయి. ఎన్‌కౌంటర్ పేరుతో సాగిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మరికొందరు ఆ పార్టీ నాయకుల, ఆదివాసీల చట్టవిరుద్ధ హత్యాకాండపై న్యాయవిచారణ జరిపించాలని ఆ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆ పార్టీలు నేతలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వి శ్రీనివాసరావు(సిపిఎం), కె రామకృష్ణ(సిపిఐ), పి ప్రసాద్ (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, కాటం నాగభూషణం (ఎంసిపిఐ(యు)), బి బంగారావు (సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, బిఎస్ అమర్‌నాథ్(ఎస్‌యుసిఐ(సి),పివి సుందరరామరాజు(ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) తదితరులు విడుదల చేసిన ఈ ప్రకటనలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, మృతుల భౌతిక కాయాలను వారి బంధులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరసన హక్కుపై ఆంక్షలు వద్దు

శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రజాసంఘాలు నిరసన తెలపడానికి శుక్రవారం చేసిన ప్రయత్నాన్ని భగ్నం చేయడంతో పాటు గ్రామాల్లో పోలీసులు హడావుడి చేస్తున్న నేపథ్యంలో నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కుపై ఆంక్షలు విధించొద్దని రాష్ట్రప్రభుత్వానికి వామపక్షాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ దారుణ హత్యలను తమ ప్రభుత్వం సాధించిన ఘన విజయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి బహిరంగంగా ప్రకటించిన విధానం అభ్యంతరకరంగా ఉందని వారు పేర్కొన్నారు. ఒకవైపు మవోయిస్టు పార్టీ శాంతి చర్చలను కోరుతున్న సమయంలో అందుకు అవకాశం ఇవ్వకపోగా మారణకాండను మరింత తీవ్రతరం చేస్తున్న కేంద్రప్రభుత్వ విధానాన్ని ఖండించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఆదివాసీల జన జీవితాన్ని అస్థిరపరుస్తూ వారి మనుగడకు ముప్పుగా మారిన తీవ్ర నిర్బంధకాండకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. మవోయిస్టులను బూచిగా చూపించి విస్తృత ఖనిజ వనరులతో కూడిన అడవులను అంతిమంగా బడా కార్పొరేట్లకు అప్పగించే రహస్య ఎజెండా కేంద్రప్రభుత్వానికి ఉందని వామపక్షాల నేతలు తెలిపారు. అందుకే ఆపరేషన్ కగార్ ఏత్తివేత కోసం జరుగుతున్న ప్రజాస్వామిక ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.


చిన్నారిని చిదిమేసిన ఉన్మాది

లైంగిక దాడి, ఆపై హత్య

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

అమ్మానాన్నలతో కలిసి పెళ్లికి వచ్చిన అభం శుభం తెలియని చిన్నారిని ఓ ఉన్మాది చిదిమేశాడు. లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు చిన్నారిని హత్య చేశాడు. కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో శుక్రవారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కడప జిల్లా ప్రొద్దుటూరులోని అమృతనగర్‌కు చెందిన దంపతులు తమ నాలుగేళ్ల కుమార్తెను వెంటబెట్టుకొని బంధువుల పెళ్లికి మైలవరం మండలం కంబాలదిన్నేకు వచ్చారు. పెళ్లి మండపం బయట ఆడుకుంటున్న వారి చిన్నారిని మోరగుడికి చెందిన తలారి రహమతుల్లా అలియాస్ కబీర్ అరటి పండు ఇస్తానని ఆశ చూపించి ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.

అనంతరం చిన్నారిని హత్య చేశాడు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలో గాలించారు. ముళ్ల పొదల్లో చిన్నారి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. లైంగిక దాడికి గురైనట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న మైలవరం మండలం తలమంచిపట్నానికి చెందిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని జమ్మల మడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిందితుడు రహమతుల్లా

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ఎ.కంబాలదిన్నె గ్రామంలో చోటుచేసుకున్న దుర్ఘటన చాలా బాధాకరమైందని సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ పేర్కొన్నారు. విలేకర్లతో వారు మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హోం శాఖ మంత్రి స్పందించి చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు నాయకులు నరేంద్ర, మధు డిమాండ్ చేశారు.

ముఖం చాటేస్తున్న మార్గదర్శులు

- పేదలకు చేయూత ఇవ్వడానికి ఆంక్షలు
- పి4 అమలుపై అధికారుల్లో అయోమయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పి-4 విధానంలో కీలకమైన మార్గదర్శులు ముఖం చాటేస్తున్నారు. పేదలను ఆదుకోవడానికి ధనవంతులు (మార్గదర్శులు) స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయూత అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతుండగా, దానికి భిన్నంగా వారు ఆంక్షలు పెడుతున్నారు. దీంతో అధికారయంత్రాంగం అయోమయానికి గురవుతోంది.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పి-4 పథకాన్ని ఇటీవల ప్రారంభించిన గుంటూరు జిల్లాలో ఈ పరిస్థితి నెలకొంది ఈ కార్యక్రమంలో సిఎం చేత ముందస్తు సన్మానాలు పొందిన పలువురు ప్రస్తుతం సాయం చేయడానికి ఆంక్షలు పెడుతున్నట్లు తెలిసింది. సిఎం కార్యక్రమంలో ముందుకువచ్చిన టెక్స్‌టైల్స్ మిల్స్, స్పిన్నింగ్ మిల్స్ నిర్వాహకులు తమకు విద్యుత్ సబ్సిడీ బకాయిలు విడుదల కావాల్సిఉందని, ఆ మొత్తాన్ని ముందు విడుదల చేస్తే, ఆ తరువాత పేదల సంగతి చూద్దామని చెబుతున్నారు. ఇటీవల గుంటూరు కలెక్టరేట్‌లో అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని వారు తేల్చిచెప్పారు. వీరిలో ఒకరిద్దరు తప్పితే మిగిలిన వారు ముందుకు రావడం లేదని సమాచారం. 50 కుటుంబాలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కూడా వెనకడుగువేసినట్లు తెలిసింది.ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వారిని ఒప్పించడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదని సమాచారం. సిఎం సభలో అధికారులు 369 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు అధికారులు ప్రకటించగా, ఆ సభలో మొత్తం 170 కుటుంబాలకు చేయూత ఇవ్వడానికి హామీలు లభించాయి. మిగిలిన 199 కుటుంబాలకు అండగా నిలిచే వారికోసం అధికారయంత్రాంగం గాలిస్తుండగానే తొలుత హామీ ఇచ్చిన వారు కూడా వెనక్కి తగ్గడం ప్రారంభమైంది. మరోవైపు ఉన్నతాధికారులు మాత్రం లక్ష్యాలను సాధించి తీరాలనే ఒత్తిడిని దిగుస్థాయి సిబ్బందిపై తీసుకువస్తున్నారు


పొన్నెకల్లులో గత నెల 14న మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు (ఫైల్)

కృషి చేస్తున్న 'డేటా సెంటర్'

సిఎం సభలో హామీలు ఇచ్చిన వారిలో 'డేటా సెంటర్' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వాహకులు మాత్రం తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. డిగ్రీ చదివిన స్వప్న అనే యువతికి తమ సంస్థలో ఉద్యోగం ఇవ్వడంతో పాటు, తాము మార్గదర్శులుగా ఉంటామని చెప్పిన 100 కుటుంబాలను ఆదుకునే విషయమై పలుమార్లు ఆసంస్థ ప్రతినిధులు గ్రామస్తులతో సమావేశమై వివరాలు తీసుకున్నారని అధికారులు తెలిపారు.

సివిల్ సప్లైస్ భవనం తెలంగాణకు అప్పగింత

- ఉభయరాష్ట్రాల మంత్రుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న సివిల్ సప్లై భవనాన్ని పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల శాఖ భవన్‌లో తెలంగాణ, ఎపి పౌరసరఫరాల శాఖ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వినియోగదారులకు మేలు రకమైన బియ్యం అందుబాటు ధరలో ఉండాలనేదే తమ ఉద్దేశమని చెప్పారు. కాకినాడ నుంచి ఫిలిప్పిన్స్‌కు బియ్యం ఎగుమతి చేస్తున్నామని, ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలపై చర్చించామని ఆయన వివరించారు. తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతర్రాష్ట్రాల మధ్య ధాన్యం అక్రమ రవాణా కట్టడి గురించి చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజనలో సివిల్ సప్లై బిల్డింగ్‌లో సగం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిందని, జూన్ 1 నుంచి భవనం మొత్తం తెలంగాణకు అప్పగించనున్నారని చెప్పారు. ఇకపై ఆహార, అనుబంధ శాఖలన్నీ సివిల్ సప్లైస్ కార్యాలయంలోనే ఉండనున్నాయని వివరించారు.

గోనెగండ్లలో విషాదం

- నీటి గుంటలో దిగి ఇద్దరు బాలికలు మృతి


మధుప్రియ


మంజుల

ప్రజాశక్తి - గోనెగండ్ల (కర్నూలు): ఈత ఆడేందుకు వ్యవసాయ నీటి గుంటలో దిగి ఇద్దరు బాలికలు మరణించారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గోనెగండ్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బోయ రంగస్వామి, మహేశ్వరి దంపతుల రెండో కుమార్తె మంజుల (13)ను పత్తి విత్తనాలు నాటేందుకు తల్లి తనతో పాటు కూలి పనులకు తీసుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన బోయ సావిట్ల మందకల్, సరస్వతి దంపతుల రెండో కుమార్తె మధుప్రియ (14)ను కూడా పత్తి విత్తనాలు నాటేందుకు తన తల్లి తీసుకొచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఇద్దరు బాలికలు కలసి సమీప పొలంలోని వ్యవసాయ నీటి గుంటలో ఈత ఆడేందుకు దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, బయటకు రాలేకపోవడంతో మునిగిపోయారు. గమనించిన తల్లిదండ్రులు సమీప కార్మికులకు చెప్పగా వారు వచ్చి బయటకు తీసేలోపు బాలికలు మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యునిగా తుడా చైర్మన్ ప్రమాణం

ప్రజాశక్తి - తిరుమల : టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్యచౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దివాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఇఒ ప్రశాంతి, విజిఒ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళం అందింది. రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి హైదరాబాద్‌కు చెందిన పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండి సత్యరోహిత్ విరాళం డిడిని అందజేశారు. ఈ విరాళాన్ని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో ఒకపూట మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు ఉపయోగించాలని దాత కోరారు.


మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేస్తున్న కోకో రైతులు


ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మంత్రులు, అధికారులు

చర్చలు విఫలం

- పంతం నెగ్గించుకున్న కోకో కంపెనీలు
- కిలోకు రూ.450నే ఇస్తామని సమాధానం
- రూ.500కు కొనుగోలు చేయాలని మంత్రి బుజ్జగింపు
- కలెక్టరేట్ వద్ద కోకో రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోకో ధరపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కోకో రైతులు, కంపెనీల మధ్య ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. రైతులకు ఏమాత్రం మేలు చేయకుండానే చర్చలు ముగిశాయి. ఈ సమావేశంలో కంపెనీలు మాత్రం తాము చెప్పినదానికి ఏ మాత్రమూ తగ్గకుండా పంతం నెగ్గించుకున్నాయి. దీంతో కంపెనీలు చెప్పినట్లుగా కిలో కోకోకు రూ.450 ధర ఇవ్వాలని, మరో రూ.50 ప్రభుత్వం చెల్లిస్తుందని, కిలో రూ.500కు కొనుగోలు చేయాలని కంపెనీలకు సూచించి మంత్రులు సమావేశం ముగించేశారు. దీంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, చర్చలు విఫలమయ్యాయంటూ కోకో రైతులు ఆందోళనకు దిగారు.

కోకోకు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ధర చెల్లించకుండా కంపెనీలు సిండికేట్‌గా మారి అన్యాయం చేస్తున్నాయని ఎపి కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గత రెండు నెలలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారుల ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. ఈ చర్చలకు కంపెనీ ప్రతినిధులు ఎవరూ ప్రత్యక్షంగా హాజరవ్వకపోవడంతో మాండలీజ్ కంపెనీకి చెందిన ప్రతినిధులతో మంత్రులు ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ముందుగా రైతులు బోళ్ల వెంకటసుబ్బారావు, ఉప్పాల కాశీ, గోపాలకృష్ణ, ఎపి కోకో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, మాజీ ఇంటెలిజెన్స్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కంపెనీలు ధర చెల్లించేలా చేయాలని ముక్తకంఠంతో కోరారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో ధర రూ.880 వరకూ ఉందని, కంపెనీలు మాత్రం రూ.450 మాత్రమే చెల్లిస్తున్నాయని తెలిపారు. అక్కడకు వచ్చిన ట్రేడర్లు మాట్లాడుతూ కంపెనీలు ఇచ్చిన ధర ప్రకారమే తాము కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. మాండలీజ్ కంపెనీ ప్రతినిధులు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ.. తమకు ప్రస్తుతం కోకో గింజలు అవసరం లేదని తెలిపారు. ధర గురించి అడగ్గా రూ.450కు మించి ఇవ్వలేమని తేల్చి చెప్పేశారు. దీంతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పామాయిల్ తరహాలో చట్టం తీసుకొచ్చి కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర అందేలా వచ్చే ఏడాదికల్లా చర్యలు చేపడతామని తెలిపారు. కంపెనీలు రూ.450 ఇస్తాయని, ప్రభుత్వం రూ.50 చెల్లిస్తుందని, కిలో రూ.500కు కొనుగోలు చేస్తారని చెప్పి రైతులు మాట్లాడుతున్నా వినకుండా చర్చలు ముగిసినట్లుగా ప్రకటించారు.

కార్పొరేట్ కంపెనీలను బుజ్జగించేలా చర్చలు

కోకో రైతులకు, కంపెనీలకు మధ్య రాష్ట్ర మంత్రుల చర్చలు విఫలమైనట్లు ఎపి కోకో రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. సమావేశ అనంతరం కలెక్టరేట్ వద్ద కోకో రైతులు మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలను బతిమలాడే విధంగా చర్చలు సాగడం బాధాకరమన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానం చేస్తూ ఫార్ములా రూపొందించి ధర ప్రకటించాలని, ఈ సీజన్లో అమ్మిన కోకో గింజలన్నింటికీ ఆ ఫార్ములా వర్తింపజేసి కోకో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

లేపాక్షి, ఆప్కోల భాగస్వామ్యంతో కీలక మార్పులు

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లేపాక్షి, ఆప్కోల భాగస్వామ్య ఒప్పందం శిల్పకారులు, చేనేతల జీవితాల్లో మార్పులు తీసుకురాగల కీలక అడుగని చేనేత జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. ఇది ఒక వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదని, రాష్ట్ర కళాకారుల, నేత కార్మికుల కళలకు గౌరవం అందిస్తూ వారి జీవనోపాధి మెరుగుపరచడానికి ఒక స్థిరమైన వేదికను సృష్టించడం అవుతుందన్నారు. విజయవాడలోని ఆప్కో ప్రధాన కార్యాలయంలో లేపాక్షి, ఆప్కో ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై శుక్రవారం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిసోడియా మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో రెండు సంస్థలు తమ హస్తకళల, చేనేత వస్త్రాల ఉత్పత్తులను రెండు సంస్థల విక్రయశాలల్లో ప్రదర్శించి విక్రయించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశకత్వంలో రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టే ప్రయత్నంలో జరుగుతున్న కృషికి ప్రతిఒక్కరి సహకారం అవసరమని కోరారు. ఆప్కో, లేపాక్షి సంస్థల ఎమ్‌డి విశ్వ మనోహర్ మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యంతో రెండు సంస్థలు పరస్పరం కలిసి పనిచేస్తూ రాష్ట్ర చేనేత కార్మికుల జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సంయుక్త శ్రేయస్సును కాంక్షిస్తూ చేసుకున్న ఒప్పందం వాణిజ్య పరంగా కొత్త మైలురాయి అవుతుందని చెప్పారు. ఉత్పత్తుల పరస్పర పంపిణీ, విక్రయశాలల్లో ప్రదేశాల కేటాయింపు, వ్యూహాత్మక ఖర్చుల తగ్గింపుపై స్పష్టమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్కో జనరల్ మేనేజర్లు నాగేశ్వరరావు, రాజారావు, చీఫ్ అకౌంట్స్ అధికారి పార్వతి, అసిస్టెంట్ డైరెక్టర్ బెనహర్, లేపాక్షి మార్కెటింగ్ మేనేజర్ శ్రీధరాచార్యులు, డెవలప్‌మెంట్ మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ ఎకానమీపై ముగిసిన వర్కుషాప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన సర్క్యులర్ ఎకానమీ అమలుపై రెండు రోజులపాటు నిర్వహించిన వర్కుషాప్ శుక్రవారం ముగిసింది. చివరిరోజు పలు ఐఐటి, మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థల నిపుణులు రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ అమలులో వినూత్న అవకాశాలను వివరించారు. రంగాల వారీ అవకాశాలను గుర్తించడానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణం, అటవీశాఖ, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులు సర్క్యులర్ ఎకానమీపై చర్చాగోష్టి నిర్వహించారు. ముగింపు కార్యాలయంలో ఎపిపిసిబి చైర్మన్ పి కృష్ణయ్య, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మోహన్ రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

డోలీలో ఆస్పత్రికి..!

- 9 కిలోమీటర్ల మేర పాట్లు

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి జిల్లా) : అనారోగానికి గురైన మహిళను డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటన అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ కొండ శిఖర పివిటిజి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మద్రేబుకు చెందిన కొండతాబేలు కిలుమో అనే మహిళ అనారోగ్యానికి గురికాగా ఆమె భర్త నర్సింగరావు, బంధువులు ఆమెను డోలీ మోతతో ఒకటీ, రెండూ కాదు... ఏకంగా తొమ్మిది కిలోమీటర్ల మేర మోసుకు వచ్చారు. మద్రేబు నుంచి ధారగెడ్డ గ్రామం వరకూ డోలీతో తీసుకువచ్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో పాడేరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనారోగ్యానికి గురైన ఆమెను ఇటీవల కాలంలో డోలీ కట్టి ఆస్పత్రికి ఇలా మూడోసారి తీసుకువచ్చారు. బల్లగరువు నుంచి మద్రేబు మీదుగా 12 కిలోమీటర్ల మేర తులసీబు వరకు బిటి రోడ్డు నిర్మాణం కోసం గతంలో రూ.11.65 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ ఆ పనులు ముందుకు సాగకపోవడంతో డోలీ కష్టాలు తప్పడం లేదు. సరైన రోడ్డు మార్గం లేక గతంలో వైద్యం అందక ఇదే ప్రాంతానికి చెందిన చిలకమ్మ అనే మహిళ మృతి చెందారు. ఇంకెన్నాళ్లు మాకీ చావు మోతలు అంటూ అప్పట్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో చాలనం రాలేదు. ఇక్కడి గ్రామాలకు రోడ్డు పనులను మొదలు పెట్టకపోతే త్వరలో జరిగే జడ్‌పి సమావేశాల రోజున భారీ ఎత్తున డోలీ యాత్ర చేపడతామని పివిటిజిల సంఘం మండల కార్యదర్శి కె నర్సింగరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు కె గోవిందరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పోలీసుల కస్టడీకి సిరాజ్, సమీర్

- ఉగ్ర కోణంపై విచారణ

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఉగ్ర కుట్ర కేసులో విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లను పోలీసులు విచారించారు. వారిని పోలీసుల కస్టడీకి ఇస్తూ విజయనగరం కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విజయనగరం పోలీసులు విశాఖ సెంట్రల్ జైలులో ఉన్న సిరాజ్, సమీర్‌లను కస్టడీలోకి తీసుకుని విజయనగరం పోలీసు శిక్షణ కళాశాల (పిటిసి)కు తరలించారు. శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అధికారులు విచారించినట్లు తెలిసింది. ఎన్‌ఐఎ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, సివిల్ పోలీసులు ఉగ్ర కోణంపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. విజయనగరం జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ సెలవులో ఉండడంతో ఎన్‌ఛార్జ్ ఎస్‌పిగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి మాధవ రెడ్డి పర్యవేక్షణలో డిఎస్‌పి స్థాయి అధికారి విచారించినట్లు తెలిసింది. సిరాజ్, సమీర్‌లను వేర్వేరు బ్లాక్‌లో ఉంచి విచారణ చేశారు. ఉగ్రవాద కార్యకలాపాల వైపు ఎలా వెళ్లారు? ఎవరెవరిని కలిశారు? దేశంలో ఎక్కడెక్కడ పేలుళ్లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు? అనే వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం. మరో ఆరు రోజులు వీరిని విచారించనున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు పూర్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇందుకు అవసరమైన యంత్రాలు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విజయవాడ క్యాంపు కారాలయం నుంచి పోలవరం ఎడమ కాలువ, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ప్రాజెక్టు పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశాలిచ్చారు. ఇటీవల పడుతున్న అకాల వర్షాల వల్ల పనులకు ఆటంకం కలుగుతుందని మంత్రి దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్, టన్నెల్, ఫీడర్ కెనాల్, పునరావాస కాలనీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో నీటి పారుదల సలహాదారు ఎం వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల సిఇలు, ఎస్‌ఇలు, ఇఇలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్‌ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞానశాస్త్రం -అభ్యసన సిద్ధాంతాలు



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

పావ్లోవ్ ప్రయోగంలోని 3 దశలు :

- పావ్‌లోవ్ కుక్క యొక్క లాలాజలగ్రంథులకు ఒక రబ్బరు ట్యూబును అమర్చి దీనిని ఒక కొల పాత్రలోకి ఉంచి, ప్రతిసారి ఎంత లాలాజలాన్ని ప్రతిస్పందిస్తుందో తెలుసుకొనే విధంగా ప్రయోగంలో అమరికను చేసుకున్నాడు.

1వ దశ : ఆహారం-లాలాజలం
(స.ఉ) (స.ప్ర)
గంట- No Respond (మొదటి దశలో
(అస.ఉ) - గంటకు కుక్క నుండి ఎలాంటి ప్రతిస్పందన లేదు అనగా అసహజ ఉద్దీపన అయిన గంట మొదటి దశలో తటస్థమైనదిగా ఉన్నది)

2వ దశ -గంటశబ్దం + ఆహారం-లాలాజలం
(అస.ఉ) (స.ఉ) (స.ప్ర)
ఈ చర్యను అనేకసార్లు చేసిన తర్వాత

3వ దశ -గంటశబ్దం-లాలాజలం
(నిబంధిత ఉద్దీపన) (నిబంధిత ప్రతిస్పందన)

నోట్ : 1) మొదటి దశలో గంట శబ్దానికి లాలాజలం అనే ప్రతిస్పందన కనిపించలేదు. కానీ దానిని సహజ ఉద్దీపన అయిన ఆహారంతో సంసర్గం చేయడం ద్వారా కుక్క నుండి చివరకు లాలాజలం అనే ప్రతిస్పందనను తెప్పించగలిగాడు. ఇలా ఒక అసహజ ఉద్దీపనకి కూడా ఇంతకు ముందు లేని సహజసిద్ధం కానటువంటి ప్రతిస్పందనకు తెప్పించగలగడాన్నే "నిబంధనా అభ్యసనం" అంటారు.

2). 2వ దశలో అసహజ ఉద్దీపనగా ప్రవేశపెట్టబడిన గంట శబ్దం, 3వ దశలో నిబంధిత ఉద్దీపనగా మారింది.

శాస్త్రీయ నిబంధనా ముఖ్య సూత్రం:

- అసహజ ఉద్దీపనను సహజ ఉద్దీపనతో సంసర్గం చేసి సహజ ఉద్దీపనకు వచ్చే ప్రతిస్పందనే అసహజ ఉద్దీపనకి కూడా కల్పించడం.
- నిబంధనం ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఉండాల్సింది-**సహజ ఉద్దీపన**

శాస్త్రీయ నిబంధనలో

1. జీవి నిష్క్రియాత్మకం
2. రాబట్టబడిన ప్రతిస్పందనలు (నిర్గమాలు) ఉంటాయి.
13. అసహజ ఉద్దీపనకు, సహజ ఉద్దీపనకు మధ్య "సంసర్గం" ఏర్పాటవుతుంది.
4. ఉద్దీపనలకు ప్రాధాన్యత ఉంటుంది. అందుకే దీనిని S-type నిబంధనం" అంటారు.
5. ఈ నిబంధనం "సామీప్యతా నియమం" పై ఆధారపడి ఉంటుంది.

నోట్ :

"సామీప్యత" అనగా రెండు అంశాలు వెన్వెంటనే సంభవించడం. ఈ ప్రయోగంలో గంట మ్రోగించిన వెంతనే ఆహారం ఇవ్వటం వల్లనే రెండింటి మధ్య సంసర్గం ఏర్పడింది.

- నిబంధన అభ్యసనం జరగడంలో పావ్‌లోవ్ తన ప్రయోగంలో అనేక విషయాలు పరిశీలించి వాటిని నిబంధనా నియమాలుగా వివరించారు. అవి

1. పునర్బలనం	2. విరమణ/విలుప్తీకరణ
3. అయత్న సిద్ధ స్వాస్థ్యము	4. సామాన్యీకరణం
5. విచక్షణ	6. ఉన్నత క్రమ నిబంధనం

1. పునర్బలనం:

ఉదా :

- అసహజ ఉద్దీపన (గంట)తో పాటు, సహజ ఉద్దీపన (ఆహారం) ను ఎక్కువసార్లు ఇస్తే సంసర్గం బలంగా ఏర్పడి నిబంధిత ప్రతిస్పందనను (గంటకు-లాలాజలం) సులభంగా రాబట్టొచ్చునని వివరించేదే పునర్బలన నియమం.

Hint : సహజ ఉద్దీపనను ఎక్కువసార్లు ఇచ్చి ప్రతిస్పందనను బలోపేతం చేయడం.

ఉదా :

- మొదటి గంట కొట్టగానే బడికి వచ్చిన విద్యార్థులకు చాక్లెట్లు ఇవ్వటం అనే చర్యను ఎక్కువ రోజులు చేస్తే నిబంధనం బాగా జరిగి ప్రతిపిల్లవాడు మొదటి గంటకే బడికి వస్తాడు అని వివరించే పావ్‌లోవ్ నియమం - **పునర్బలన నియమము**

2. విరమణ/విలుప్తీకరణ:

- నిబంధిత ఉద్దీపన (గంట) మాత్రమే ప్రవేశపెట్టి సహజ ఉద్దీపన (ఆహారం) ఇవ్వటం మానివేస్తే కొద్దిరోజుల తర్వాత నిబంధిత ప్రతిస్పందన (గంటకు లాలాజలం) రావడం కూడా ఆగిపోతుంది. అని వివరించేదే **"విరమణ నియమం".**

ఉదా :

Hint : సహజ ఉద్దీపనను ఇవ్వటం ఆపేయటం ద్వారా నిబంధిత ప్రతిస్పందన ఆగిపోవడం.

1. నిబంధనము జరిగి మొదటి గంటకే బడికి వచ్చు విద్యార్థులకు చాక్లెట్స్ ఇవ్వటం మానివేస్తే విద్యార్థులు కూడా మొదటి గంటకే బడికి రావడం అనే చర్యను విరమిస్తారు/మానివేస్తారు. అని వివరించే పావ్‌లోవ్ నియమం **- విరమణ/విలుప్తీకరణ నియమం.**

నోట్ : మంచి ప్రవర్తనను బలపర్చటానికి పునర్బలన నియమం

చెడు ప్రవర్తనను తొలగించటానికి- విరమణ/విలుప్తీకరణ నియమం వాడుతారు.

3. అయత్న సిద్ధ స్వాస్థ్యము:

3 నిబంధన విరమణ జరిగినప్పటికి తిరిగి అప్పుడప్పుడూ గత సంసర్గం గుర్తుకు వచ్చి నిబంధిత ఉద్దీపన (గంట)కు నిబంధిత ప్రతిస్పందన (గంటకు లాలాజలం) కనిపించే అవకాశం ఉంటుంది అని వివరించేదే **"అయత్నసిద్ధ స్వాస్య నియమము'.**

Note : నిబంధన విరమణ జరిగిన అప్పుడప్పుడూ నిబంధిత ప్రతిస్పందన కనిపించడం.

ఉదా : చాక్లెట్స్ ఇవ్వడం మానివేసిన తర్వాత మొదటి బెల్లుకే బడికి రావడం కూడా మానివేసిన విద్యార్థులు అప్పుడప్పుడు మాత్రం కొద్దిమంది విద్యార్థులు మొదట బెల్లుకే బడికి వచ్చి ఉపాధ్యాయుల వైపు చాక్లెట్లు ఇస్తారేమో అని ఆశతో చూడటం అనేది పావ్‌లోవ్ యొక్క ఏ నియమాన్ని వివరిస్తుంది.
- అయత్న సిద్ధ స్వాస్థ్యం

2. ఫ్యాక్టరీ నుంచి రిటైరైన కార్మికుడు ఒక రోజు సైరన్ శబ్దం చిన్నప్పుడు అప్రయత్నంగా తన యూనిఫారమ్ ధరించి ఫ్యాక్టరీకి బయలుదేరాడు. ఇంతలో అసలు విషయం గుర్తుకొచ్చి తన పొరపాటుకు నవ్వుకుని డ్రస్‌ను విప్పేస్తాడు. ఇక్కడ కార్మికుడి చర్యను వివరించే పావ్‌లోవ్ నియమం **- అయత్న సిద్ధ స్వాస్థ్యం**

4. సామాన్యీకరణము :

- నిబంధిత ఉద్దీపన (గంట)తో పాటు దానితో పోలి ఉన్న ఇతర ఉద్దీపనలు (బజర్, హార్న్, సైకిల్‌బెల్) కు కూడా నిబంధిత ప్రతిస్పందన కనిపించింది. దీనినే **"సామాన్యీకరణ నియమం"** అంటారు.

Hint:- పోలిక ఉన్న ఉద్దీపనలకు ఒకే రకమైన ప్రతిస్పందన కనిపించటం.

Note: పై ఉద్దీపనలన్నింటిలో పోలిక ఉన్న ఉమ్మడి ధర్మం ఉంటుంది. ఇక్కడ ధ్వని అనేది అన్నింటిలో ఉన్న సామాన్య ధర్మము.

5. ధ్వనిని సామాన్యీకరణం చేసుకుని ధ్వనిని ఇచ్చే అన్ని పరికరాలకు కుక్కలో మొదట నిబంధిత ప్రతిస్పందన కనిపించింది. నిబంధనా అభ్యసనంలో మొదట ఎప్పుడు **"సామాన్యీకరణం"** జరుగుతుంది.

- ఒక LKG పిల్లవాడు బడిగంట మ్రోగడంతో బడికి పోవడాన్ని నిబంధనం చేసుకుని తన బడి గంట మ్రోగినప్పుడే కాకుండా గుడిగంట మ్రోగినా, పీచు మిఠాయి వాటి బండి గంట మ్రోగినా సంచి సంకకు తగిలించుకుని బడికి బయలుదేరుతున్నాడు. ఈ ఉదాహరణను వివరించే పావ్‌లోవ్ నియమం-**సామాన్యీకరణం**

2. మొదటిసారి పాఠశాలకు వెళ్ళిన పిల్లవాడు మాస్టారు చేతి బెత్తంతో దెబ్బలు తిని తర్వాత బెత్తం పట్టుకున్న ఎవరిని చూసినా భయపడి ఏడవడంను వివరించే పావ్లోవ్ నియమం-**సామాన్యీకరణం**

5. విచక్షణ :

- కేవలం నిబంధిత ఉద్దీపన (గంట)కు మాత్రమే ప్రతిస్పందించి ఇతర పోలిక ఉన్న ఉద్దీపనల (బజర్, హార్న్, సైకిల్‌బెల్)కు ప్రతిస్పందించకపోవడాన్ని వివరించేదే **"విచక్షణా నియమం".**

Hint :పోలిక ఉన్న ఉద్దీపనలకు కాకుండా కేవలం నిబంధిత ఉద్దీపనకు మాత్రమే ప్రతిస్పందించడం..

Note : శిశువులో అనుభవం పెరిగే కొలదీ సామాన్యీకరణ స్థానంలో విచక్షణ ఏర్పడుతుంది.

1. LKG విద్యార్థి గుడి గంటకు, పీచు మిఠాయి వాని బండి గంటకు కాకుండా కేవలం తన బడిగంట మ్రోగినప్పుడు మాత్రమే సంచి చంకకు తగిలించుకుని బడికి బయలుదేరుతున్నాడు. ఈ చర్యను వివరించే పావ్‌లోవ్ నియమం-**విచక్షణ.**

2. మొదట ఖాకీ డ్రస్ వేసుకున్న పోలీసుకు, కండక్టరు, గార్డ్‌కు భయబడే శిశువు కొద్ది రోజుల తరువాత పోలీసుకు మాత్రమే భయాన్ని ప్రకటించటమనే చర్యను వివరించే పావలోవ్ నియమం **- విచక్షణ.**

Note : నిబంధనా అభ్యసనం మొదట్లో సామాన్యీకరణం జరిగి చివరకు **విచక్షణ** ఏర్పడుతుంది.

వాట్సన్ ప్రయోగం:

- "అమెరికా"కు చెందిన, ప్రవర్తనా వాద మూలపురుషుడైన J.B వాట్సన్ అనే శాస్త్రవేత్త నిబంధన అభ్యసనంపై ప్రయోగాలు చేసే క్రమంలో ఆల్బర్ట్ అనే 11 నెలల శిశువుకు తెల్ల ఎలుకతో ఆడుకునే అలవాటు చేసి తర్వాత ఒక పెద్ద శబ్దంతో తెల్ల ఎలుకంటే శిశువు భయపడేటట్లు చేశాడు. అయితే ఆ శిశువు తెల్లఎలుకతో పాటు ఇతర తెల్లని వస్తువులను వేటిని చూసినా భయపడి ఏడ్చేవాడు. దీనినే "సామాన్యీకరణం" అన్నాడు. (తెలుపు రంగుని సామాన్యీకరణం చేసుకుని ప్రతిస్పందించడం)

3. అయితే శిశువు పెద్దయ్యేకొలదీ ఇతర తెల్లని వస్తువులకు భయపడకుండా తెల్లని ఎలుకకు మాత్రమే తన భయాన్ని ప్రకటించేవాడు. దీనినే **"విచక్షణ"** అన్నారు.

6. ఉన్నత క్రమ నిబంధనం:

- ఒక అసహజ ఉద్దీపనకు కల్పించిన నిబంధిత ప్రతిస్పందనను దానితో సంసర్గం చేయటం ద్వారా మరొక అసహజ ఉద్దీపనకు కూడా కల్పించటాన్నే ఉన్నత క్రమ నిబంధనం అంటారు.
- భిన్నమైన అసహజ ఉద్దీపనలకి కూడా ఒకే రకమైన నిబంధిత ప్రతిస్పందనను కల్పించొచ్చు అని వివరించేదే 'ఉన్నత క్రమ నిబంధనం' నియమము'
- మొదటి నిబంధనలో నిబంధిత ఉద్దీపనగా ప్రవేశపెట్టిన గంటను, 2వ నిబంధనలో సహజ ఉద్దీపనగా ప్రవేశపెట్టి మరొక నూతన అసహజ ఉద్దీపన (దీపం)ను దానితో సంసర్గం చేసి నూతన అసహజ ఉద్దీపనని కూడా నిబంధిత ఉద్దీపనగా ఏర్పాటు చేయడాన్నే "ఉన్నత క్రమ నిబంధనం" అంటారు.

Hint : భిన్నమైన ఉద్దీపనలకు ఒకే ప్రతిస్పందన తెప్పించడం.

1వ నిబంధన : గంట **లాలాజలం**
(ని.ఉ) (స.ప్ర)

2వ నిబంధన : దీపం+గంట-లాలాజలం
(అస.ఉ) (స.ఉ) (స.ప్ర)

ఉన్నత క్రమ నిబంధనం:
దీపం- లాలాజలం
(ని.ఉ) (ని.ప్ర)

Note :

- నిబంధిత ఉద్దీపన అయిన గంటకు వచ్చే లాలాజలం అనే ప్రతిస్పందన ఇప్పుడు దీపంనకు కూడా వస్తుంది. ఇలా భిన్నమైన ఉద్దీపనలకు ఒకే నిబంధిత ప్రతిస్పందనను కల్పించడమే **"ఉన్నత క్రమ నిబంధనం".**

ఉదా :

1. మొదటిసారి డ్రిల్ మాస్టారు చెప్పిన 1, 2 లకు అనుగుణంగా ఎక్సర్ సైజులు చేసిన విద్యార్థులు తర్వాత వాటితో సంసర్గం చేసిన విజిల్ శబ్దాలకు కూడా అవే ఎక్సర్సైజులు చేయటాన్ని వివరించే పావ్‌లోవ్ నియమం **ఉన్నత క్రమ నిబంధనం**
2. సిటీబస్‌లో క్లీనర్ విజిల్ వేసినా, గంట మ్రోగించినా, బల్బ్ వెలిగించిన బస్ డ్రైవర్ బస్సును ఆపటం లేదా కదిలించటం చేయటాన్ని వివరించే పావ్‌లోవ్ నియమం **ఉన్నత క్రమ నిబంధనం.**

Note:

సూది వేసే డాక్టర్‌ను తెల్ల డ్రస్సుతో నిబంధనం చేసుకుని భయపడే పిల్లవాడు తెల్లడ్రస్సు వేసుకున్న ఎవరిని చూసినా భయాన్ని ప్రకటించడం అనేది "సామాన్యీకరణం" అవుతుంది.

- అలా కాకుండా డాక్టర్‌కు భయపడే పిల్లవాడు ఇంటి బయట అతని చెప్పులను చూసిన ఇంటి ముందు అతని వాహనం చూసినా అతడు నివసించే వీధిని చూసినా భయాన్ని ప్రకటించడం "ఉన్నత క్రమనిబంధనం" అవుతుంది..


కార్యసాధక నిబంధనా సిద్ధాంతం

ఈ సిద్ధాంతానికి ఇతర పేర్లు :

1. ప్రచాలకా నిబంధన సిద్ధాంతం
2. పరికరాత్మక నిబంధన సిద్ధాంతం
3. R-type నిబంధనం
4. R-S నిబంధనం
5. పునర్బలన నిబంధనం

- కార్యసాధక నిబంధనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు- B.Fస్కిన్నర్ **(అమెరికా)**
- వీరు తన కార్యసాధక నిబంధనా ప్రయోగాలను ఎలుకలపై, పావురాళ్ళపై చేసి అవి కనబరచిన కార్యసాధక ప్రవర్తనను The concept of the reflex in the description of behaviour అనే పరిశోధనా వ్యాసం ద్వారా వివరించారు.

రేపు : ఉద్దీపన ప్రతిస్పందనలు



జల రవాణా సులభతరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జల మార్గాల అనుసంధానంతో జల రవాణా సులభతరం చేసేందుకు కృషి చేయనున్నట్లు దేశీయ జలమార్గముల ప్రాధికార సంస్థ ఛైర్మన్ జడ్ శివప్రసాద్ తెలిపారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో జల రవాణా కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. సాగరమాల ప్రాజెక్టుకు అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఒ జివి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓపెన్ వెయిటింగ్ హాల్ పైకప్పు పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - గుంతకల్లు

అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఏడవ నంబర్ ప్లాట్‌ఫాం ఓపెన్ వెయిటింగ్ హాల్ పై కప్పు ఊడి పడడంతో ఓ బాలుడు మరణించాడు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు, శ్రావణి దంపతులు తమ కుమారుడు మణికంఠ (8)తో కలిసి రామేశ్వరం వెళ్లడానికి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు గురువారం సాయంత్రం వచ్చారు. వారు వెళ్లే రైలు శుక్రవారం ఉండడంతో ఆ రాత్రి స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఏడవ నెంబర్ ప్లాట్ ఫారంలోని ఓపెన్ వెయిటింగ్ హాలులో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున వెయిటింగ్ హాలు పైకప్పు ఊడి బాలుడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

నిర్బంధం ద్వారా సమ్మెను అణచలేరు

- సమ్మె ఉధృతి ద్వారా.. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాల నేతల పిలుపు
- కూర్మన్నపాలెం కూడలిలో 12 గంటల దీక్ష

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కాంట్రాక్టు కార్మికుల ఉపాధిని కాపాడుకోవాలని, తొలగించిన కార్మికుల ఉపాధిని తిరిగి సాధించాలని, ఉన్న హక్కులను పరిరక్షించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. నిర్బంధం ద్వారా సమ్మెను అణచివేయాలని అనుకోవడం అవివేకమే అవుతుందన్నారు అక్రమ తొలగింపులను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు తలపెట్టిన సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. కాంట్రాక్టు కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. నిరవధిక సమ్మె ఉధృతిలో భాగంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి నమ్మి రమణ, ఎఐటియుసి నాయకులు ఎల్.సోమరాజు, ఐఎన్‌టియుసి నాయకులు పి.భాస్కరరావు, హెచ్‌ఎంఎస్ నాయకులు యు.అప్పారావు కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద 12 గంటల దీక్షకు కూర్చున్నారు. దీక్షను విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.మణి, హెచ్‌ఎంఎస్ నాయకులు పి.రమణ, నిర్వాసితుల సంఘం నాయకులు పి.భాస్కరరావు, ఎఐటియుసి నాయకులు ఎం.పైడిరాజు, ఎస్‌కె.రెహమాన్, ఎం.రవి, ఐఎన్‌టియుసి నాయకులు యు.వంశీకృష్ణ మాట్లాడారు. నాలుగు రోజులుగా విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టకపోవడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం 5600 మంది కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేస్తుంటే ఆ ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆపకుండా కేంద్ర ప్రభుత్వ ద్రోహంలో పాలుపంచుకోవడం కార్మికులను, ప్రజలను మోసగించడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర పోలీసులను పరిశ్రమ లోపల, బయట పెద్ద ఎత్తున మోహరించి కార్మికులపై నిర్బంధం ప్రయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెంటనే జోక్యం చేసుకొని కేంద్రంతో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ముఠా కార్మికులు సంఘీభావం ప్రకటించారు.

సమ్మెపై నిర్బంధాన్ని ఖండిస్తూ నిరసనలు

ఉక్కు సమ్మెపై నిర్బంధాన్ని ఖండిస్తూ విశాఖలోని పలుచోట్ల శుక్రవారమూ సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు కొనసాగాయి. ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను నిలిపివేయాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని నిలిపివేయాలని కోరుతూ వామపక్ష పార్టీలతో పాటు కార్మిక, ప్రజా సంఘాలు సంయుక్తంగా విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశాయి.

బదిలీల మినహాయింపు సర్టిఫికెట్ల వాస్తవికతను ధ్రువీకరించాలి

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ సంఘాల ప్రతినిధుల బదిలీల మినహాయింపు సర్టిఫికెట్ల వాస్తవికతను ధ్రువీకరించేందుకు మార్గదర్శకాలను నిర్ధేశిస్తూ ప్రభుత్వం సర్క్యులర్ మెమోను జారీ చేసింది. బదిలీల మినహాయింపును వర్తింపజేసేందుకు ఉద్యోగ సంఘాల నుంచి పొందాల్సిన సర్టిఫికెట్లను నిర్ధారిస్తూ సర్క్యులర్ మెమో నెంబరు +ూణఉ1-ాఔఉూజుక్ష్మూ/13/2024-ంషను ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ షంషేర్ సింగ్ రావత్ గురువారం జారీ చేశారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీల మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసిన కొన్ని సందర్భాలు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు, అవి విచారణలో ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల హెచ్‌ఒడిలు, కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు అసోసియేషన్ల నుంచి నిర్ణీత పత్రాలను పొందాలని, జనరల్ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ల ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు, కింది స్థాయి ఉద్యోగి నుంచి గెజిటెడ్ ఆఫీసర్స్ కేటగిరి వరకు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ల పదవి, వారి పదవీకాలం మొదలైనవి అసోసియేషన్ ఉప చట్టాల్లో కవర్ చేయబడి ఉన్నాయో లేదో పరిశీలించాలని, వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో చూడాలన్నారు. ఆఫీస్ బేరర్ పదవి ఎన్నికకు ఎన్నికల అధికారిని నియమించడానికి అసోసియేషన్/సమర్ధ అధికారం జారీ చేసిన ప్రొసీడింగ్స్, ఆఫీస్ బేరర్ పదవి ఎన్నికల అధికారి జారీ చేసిన నోటిఫికేషన్, ఆఫీస్ బేరర్లుగా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ ఎన్నికల అధికారి జారీ చేసిన ప్రొసీడింగ్స్, కో-ఆప్టెడ్ ఆఫీస్ బేరర్ విషయంలో, ఆఫీస్ బేరర్‌ను కో-ఆప్ట్ చేస్తూ జనరల్ బాడీ తీర్మానం కాపీ, ధ్రువీకరణ పత్రాలను సంబంధిత ఉద్యోగ సంఘాల నుంచి పొందడంతో పాటు వాటి వాస్తవికతను ధ్రువీకరించిన తర్వాత సాధారణ బదిలీల నుంచి మినహాయింపును వర్తింపజేయాలని సర్క్యులర్ మెమోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు గుర్తించినా ఎపిసిఎస్ (సర్వీస్ అసోసియేషన్ల గుర్తింపు) నియమాలు 2001 ఎపిసిఎస్ (సిసిఎ) నియమాలు, 1991 ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందుకు సంబంధించిన వాటిపై చర్యలు తీసుకునే అధికారికి నివేదికను సమర్పించాలని ఆయా సెక్షన్ల అధికారులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా మేజిస్ట్రేట్‌లు కచ్చితంగా ఆదేశాలు పాటించాలని పేర్కొంది.

నాణ్యమైన బియ్యాన్ని సరాఫరా చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ మాఫియాను అరికట్టేందుకు వాహనాలను రద్దు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ మేత కోసం అన్నట్లుగా ఉందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, కార్యదర్శి డి రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సన్న బియ్యం, మంచి బియ్యం రేషన్‌కార్డు దారులకు సరఫరా చేస్తే రేషన్ మాఫియా దానంతట కనుమరుగవుతుందన్నారు. తినడానికి పనికొచ్చే బియ్యం సరఫరా చేస్తే ఒక్క కేజీ కూడా మాఫియాకు దక్కవన్నారు. నాడు వైసిపి, నేడు టిడిపి ఎమ్మెల్యేలకు ఇది వరంగా మారిందని ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. మంచి బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వానికి ఐద్వా రాష్ట్ర కమిటీ సూచించింది.

డ్రైవర్ల సర్వీసు వాహనాల వారీ పరిగణించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న డ్రైవర్ల వివరాలు సేకరించే క్రమంలో భారీ, మధ్య తరహా, చిన్న వాహనాల వారీ సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ సంచాలకులు పి సంపత్ కుమార్‌కు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ బి ముత్యాలరావు శుక్రవారం లేఖ రాశారు. అలాగే మెకానికల్, ఫంక్చరింగ్, పెయింటింగ్, పార్కుల్లో శానిటరీ పనులు చేస్తున్న వర్కర్ల వివరాలతోపాటు వారి సీనియార్టీ వివరాలు సేకరించాలని కోరారు. హెల్పర్స్, అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర విధులు నిర్వహిస్తున్న కార్మికుల సీనియార్టీ వివరాలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాన్ పిహెచ్ వర్కర్స్‌కు సంబంధించి కేటగిరీల వారీ వివరాలు సేకరిస్తున్నందుకు డైరెక్టర్ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం

- వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని, బాధితులను ముద్దాయిలుగా మారుస్తున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు ఎం మనోహర్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తున్నా.. పోలీసుల తీరు మారడం లేదని, కూటమి ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మలుగా పోలీసులు మారారన్నారు. దాచేపల్లిలో వైసిపి కార్యకర్త హరికృష్ణను దారుణంగా హింసించిన పోలీసులపై కోర్టులో ప్రైవేట్ కేసులు వేస్తామన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులు, వైసిపి కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు.

30 వేల మహిళా వ్యాపారవేత్తలు

- మెప్మా లక్ష్యమన్న ఎమ్‌డి తేజ్ భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో 30 వేల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలనేదే లక్ష్యమని మెప్మా డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆయా జిల్లాల్లోని ఎన్‌జిఒలు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌జిఒలు, ప్రముఖ కార్పొరేట్ కంపెనీల సహకారంతో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎమ్‌డియు వాహన ఆపరేటర్లు, అసిస్టెంట్ల ఉపాధి కాపాడాలి

- పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థలో గత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎమ్‌డియు వాహనాల ఆపరేటర్లు, అసిస్టెంట్లను విధుల్లో కొనసాగించాలని ప్రభుత్వానికి పౌర సరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కృష్ణ, ఎస్ ఉదయ భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో తప్పులను ప్రభుత్వం సరిదిద్ది ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రతి ఇంటికీ సక్రమంగా సరుకులు చేరవేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నెలలో 15 రోజులు మాత్రమే పని ఉంటుందని, వారి సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. 18,520 మంది ఆపరేటర్లు, అసిస్టెంట్లను వారి కుటుంబాలను వీధిపాలు చేయకుండా ఆదుకోవాలని, ఉపాధి పరిరక్షణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు.

సంపాదకీయం

అమానుషం

చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ అడవుల్లో బుధవారంనాటి మావోయిస్టుల భారీ 'ఎన్‌కౌంటర్' రాజ్యహింసకు ప్రతిరూపం. మావోయిస్టు పార్టీ పలుమార్లు చర్చలను అభ్యర్థిస్తూ చేసిన ప్రతిపాదనలను అటు కేంద్రం ఇటు చత్తీస్‌గఢ్ బిజెపి ప్రభుత్వాలు వినిపించుకోకుండా మావోయిస్టులను భౌతికంగా అంతమొందించేందుకు తెగబడటం ప్రజాస్వామ్యంలో ఆమోదించరాని చర్య. ఈ అమానుష హత్యాకాండను తమ ఘనతగా ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా సమర్థించుకొని, మావోయిజం నిర్మూలనలో ఒక మైలురాయిగా అభివర్ణించి, పోలీస్, భద్రతా బలగాలను అభినందించి మనుషుల ప్రాణాలు తీయడాన్ని కూడా సెలబ్రేట్ చేసుకోవడం అమానుషం. ఎంతటి జటిల సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చన్న అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాన్ని మోడీ ప్రభుత్వం నిరాకరించి తనలోని అమానవీతను బయటపెట్టుకుంది. మావోయిస్టుల చర్చల విజ్ఞప్తులపై అంగీకరించాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరులు చేసిన వినతిని పెడచెవినపెట్టి అమిత్‌షా, చత్తీస్‌గఢ్ సిఎం చర్చలు జరపబోమని ప్రకటించి హత్యలు, విధ్వంసం, వినాశనాలను ఎంచుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం.

వచ్చే మార్చి కల్లా దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని అమిత్‌షా పదే పదే డెడ్‌లైన్‌ను గుర్తు చేస్తుండగా, అందుకుతగ్గట్టు చత్తీస్‌గఢ్, ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు భద్రతా బలగాల విస్తృత గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లతో నిత్యం నెత్తురోడుతున్నాయి. నారాయణపూర్, బస్తర్, దంతెవాడ అడవుల్లో కేంద్రం, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు యుద్ధం ప్రకటించాయి. మావోయిస్టుల పేరిట అమాయక ఆదివాసీలపై దాడులు, అక్రమ నిర్బంధాలు పౌర, మానవ, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాయబడుతున్నాయి. ఈ అక్రమ అణచివేత చర్యల్లో వేలాది మంది చనిపోయారని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో మోడీ ప్రభుత్వం దండకారణ్యం టార్గెట్‌గా వేలాది మంది సాయుధ దళాలతో జల్లెడ పడుతోంది. బేస్‌క్యాంప్‌లు, ఫార్వర్డ్ ఆపరేటింగ్ స్థావరాలు, నిఘా సమాచార సేకరణ డ్రోన్లు, శాటిలైట్ మ్యాపింగ్, సైనిక హెలికాప్టర్లు, మావోయిస్టుల ప్రాబల్యంలోని ప్రాంతాల స్వాధీనం, ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటివి జరుగుతున్నాయి. ఈ వ్యవహారం పరాయి దేశంపై దండెత్తిన మాదిరి. దీనిలో భాగమే మే 19న చేపట్టిన ఆపరేషన్ కగార్. ఈ ఎన్‌కౌంటర్‌లోనే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మందిని కడతేర్చారు.

మోడీ ప్రభుత్వం తలకెత్తుకున్న 'మావోయిస్టు ముక్త భారత్' వెనుక అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. విలువైన ఖనిజ, ప్రకృతి సహజ వనరులు మన అడవులకు ప్రత్యేకం. వాటిపై ఎప్పటి నుంచో కార్పొరేట్లు కన్నేశారు. ఆ వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. పర్యావరణాన్ని కూడా లెక్క చేయకుండా చెట్ల నరికివేత, పవర్ ప్రాజెక్టులు, భారీ మైనింగ్‌లకు అనుమతులిస్తోంది. గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టే దుర్మార్గానికి ఒడిగట్టింది. చివరికి రాజ్యాంగాన్ని, ఆదివాసీలకు కల్పించిన హక్కులను, వారికి రక్షణగా ఉన్న చట్టాలను నీరుగారుస్తోంది. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ గిరిజనుల గెంటివేతకు మావోయిస్టు బూచి చూపిస్తోంది. బతుకు పోరాటం చేస్తున్న స్థానిక గిరిజనుల ఉద్యమాలను ఉక్కుపాదంతో నలిపేస్తోంది. ఎన్‌కౌంటర్ అంటే ఎదురుకాల్పులు అన్న అర్థాన్ని మార్చేసింది. ముందుగా పట్టుకొని కాల్చిచంపడమే ఎన్‌కౌంటర్ అనే నిర్వచనాన్ని స్థిరపర్చింది. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ డిమాండ్ సహేతుకమైనది. మావోయిస్టుల రాజకీయాలను అంగీకరించకపోవచ్చు. హింస ఎటువైపు జరిగినా ప్రజాస్వామ్యంలో ఆమోదం కాదు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్య హింసకు అనుమతి ఉండదు. మావోయిస్టుల సమస్య శాంతి భద్రతలకే పరిమితం కాదు. ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణంలో చూడాలి. అన్ని రకాల పారా మిలిటరీ చర్యలను నిలిపేసి మావోయిస్టులతో మోడీ ప్రభుత్వం చర్చలు జరపాలి. ఎన్‌కౌంటర్లో మరణించిన వారి మృతదేహాలను ఇవ్వడానికి తాత్సారం చేయడం సరికాదు. వెంటనే బంధువులకు అప్పగించాలి. ప్రజాస్వామిక వాతావరణం కోసం ప్రజాతంత్ర ఉద్యమం నెరపాల్సిన సమయమిది.

మహనీయుల మాట



మనకు రెండు రకాల విద్య అవసరం. ఒకటి జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పేది. రెండవది ఎలా జీవించాలో నేర్పేది.

- ఓలే రోమర్,
డానిష్ ఖగోళ శాస్త్రవేత్త.

విశ్లేషణ

దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం




వి. రాంభూపాల్

పహల్గాంలో ఉగ్రవాదుల అమానుష దాడి జరిగి నెల రోజులైంది. ఉగ్రవాదంపై యుద్ధంతో ప్రారంభమై, కాల్పుల విరమణతో ముగిసిన పరిణామాలు దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా మారాయి. దేశ భద్రతకు సవాలుగా మారిన ఉగ్రవాదాన్ని గట్టిగా అరికట్టాలని ప్రతి భారతీయుడు కోరుకున్నాడు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను బలపరిచారు. ఉగ్ర దాడికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా సమైక్యతా భావం వెల్లివిరిసింది. అయితే అమెరికా ఆదేశాలతో జరిగిన కాల్పుల విరమణ, తదనంతర సంఘటనలు ఇన్నేళ్ళుగా మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి. యుద్ధోన్మాదంతో రెచ్చిపోయిన మూకలు అధికారుల మీద, వారి కుటుంబ సభ్యుల మీద చేస్తున్న ట్రోలింగ్ దాడులు సైమక్యతకు సవాళ్ళు విసురుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రధాని మౌన మునిగా మారిపోవడం మరింత ఆందోళనకరం. పాలక అనుచర మీడియా రోత పుట్టేలా మోత మోగించినా వాస్తవాలను గ్రహించిన నెటిజన్లు అన్ని వైపుల నుండి వదులుతున్న ప్రశ్నల శరాఘాతాలకు కేంద్ర పాలకులు, వారి అనుయాయులు తల్లడిల్లుతున్నారు. తాము పెంచి పోషించిన సోషల్ మీడియా తమకే భస్మాసుర హస్తంగా మారుతుండడంతో బెంబేలెత్తుతున్నారు. ట్రంప్ ఆలింగనం ధృతరాష్ట్ర కౌగిలిగా మారుతుండంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారు.

ఉగ్ర దాడి - కాల్పుల విరమణ

కాశ్మీర్ లోని పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు 26 మందిని బలిగొన్నారు. 16 మంది అక్కడికక్కడే చనిపోగా పది మంది ఆసుపత్రికి తరలిస్తున్నప్పుడు, చికిత్స పొందుతున్నప్పుడు మరణించారు. ఇందులో ఒకరు నేపాలీ కాగా మిగిలినవారు భారతీయులు. కాల్పుల సమయంలో ఉగ్రవాదులను ఎదిరించి వీర మరణం పొందిన సయ్యద్ హుస్సేన్ కాశ్మీర్ స్థానికుడు కాగా, మిగిలిన వారు సుందర కాశ్మీరాన్ని సందర్శించడానికి వచ్చిన యాత్రికులు. దాడి జరిగిన వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి జమ్ముకాశ్మీర్‌కు వెళ్లగా, సౌదీ అరేబియా పర్యటనలో వున్న ప్రధాని పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని వచ్చారు. ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ హస్తం వుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మరుసటి రోజు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం జరిపి కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని తక్షణం తాత్కాలిక నిలుపుదల చేసి, కిందకు నీటి పారుదలను నిలిపివేసింది. అట్టారీ-వాఘా సరిహద్దు మూసివేసింది. గతంలో పాకిస్తానీయులకు జారీ చేసిన ప్రత్యేక వీసాలను రద్దు చేసింది. వారంతా 48 గంటల్లో దేశం విడిచి వెళ్ళాలని, ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నేవీ, వైమానిక సలహాదారులు వారం రోజుల్లో దేశం విడిచిపోవాలని ఆదేశించింది. ఇంత తీవ్రంగా ప్రభుత్వం స్పందించిన మరుసటి రోజు అంటే ఏప్రిల్ 24న రాజకీయ పార్టీల సమావేశం వేశారు. అందులో ప్రధాని పాల్గొనకుండా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్ళి మొట్టమొదటిసారి ఇంగ్లీషులో ఉపన్యసించారు. "పహల్గాం ఉగ్ర దాడి వెనుక వున్నవారిని, కుట్రలో భాగమైన వారిని ఊహకందని రీతిలో శిక్షిస్తాం, ప్రతి ఉగ్రవాదిని గుర్తించి శిక్షిస్తామని భారతీయులకు హామీ ఇస్తున్నా"నని ఆ సభలో ప్రకటించారు. కాశ్మీర్‌లోని ఉగ్రవాద ఇళ్ళుగా ఎంపిక చేసిన వాటిని ఏప్రిల్ 28న కూల్చి వేసి, సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ఏప్రిల్ 29న ప్రధాని ప్రకటించారు.



> **ఉగ్ర దాడికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా సమైక్యతా భావం వెల్లివిరిసింది. అయితే అమెరికా ఆదేశాలతో జరిగిన కాల్పుల విరమణ, తదనంతర సంఘటనలు ఇన్నేళ్ళుగా మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి. యుద్ధోన్మాదంతో రెచ్చిపోయిన మూకలు అధికారుల మీద, వారి కుటుంబ సభ్యుల మీద చేస్తున్న ట్రోలింగ్ దాడులు సైమక్యతకు సవాళ్ళు విసురుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రధాని మౌన మునిగా మారిపోవడం మరింత ఆందోళనకరం.**

> **కేంద్రానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటిని ఖండించకపోగా, బిజెపి 'తిరంగా' యాత్రను ప్రభుత్వ యాత్రగా మార్చి లౌకిక శక్తులను దూరం చేసుకుంటున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు చేస్తున్న ఈ దుర్మార్గపు చర్యలను వైసిపి వ్యతిరేకించడంలేదు. బిజెపికి తోడ్పడే చర్యలు అంతిమంగా ఈ మూడు పార్టీలకూ చేటు తెస్తాయని గుర్తించాలి. యుద్ధోన్మాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక శక్తులు రాష్ట్ర వారసత్వ విలువలను సమున్నతంగా నిలపాలి.**

ఈ పరిణామాల నేపథ్యంలో బిజెపి భజన బృందం అటు సోషల్ మీడియా, ఇటు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ఎంత రెచ్చగొట్టాలో అంతా చేశారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టాలని, ప్రజల మధ్య మత విభజన తీసుకురావాలని ఉగ్రవాదులు పథకం ప్రకారం ఈ దాడి చేశారు. దానికి ఊతమిచ్చేలా ఈ మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. పాకిస్తాన్‌పై యుద్ధం జరుగుతుందని, ఒక్క దెబ్బతో ఆ దేశం సర్వనాశనం అవుతుందని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని, పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించనున్నామని ఇలా నోటికి, చేతికి అడ్డు అదుపు లేకుండా చెప్పారు, రాశారు. అమరావతి రెండవసారి శంకుస్థాపనకు వచ్చిన మోడీ నమో మిస్సైల్ అని ఒకరు, ఆయన మనసు నిండా పహల్గాం ఆవేదనతో ఉన్నారని మరొకరు పోటీ పడి కీర్తించారు. మరోవైపు, పవన్ కళ్యాణ్ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. అయితే మీడియాలోని కొన్ని సంస్థలు, సోషల్ మీడియాలోని కొందరు వ్యక్తులు వాస్తవ పరిస్థితులను తమ శక్తి మేరకు వినిపించే ప్రయత్నం చేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ యువత, ప్రజలు స్పందించిన వీడియోలు, బాధిత కుటుంబాల ప్రతిస్పందనలు వాస్తవ భారతీయతను ప్రతిబింబించాయి. దేశవ్యాప్తంగా ఐక్యంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి మృతులకు నివాళి అర్పించడంతో పాటు, ఉగ్రవాదాన్ని, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను తీవ్రంగా నిరసించారు. దశాబ్దాల తర్వాత కాశ్మీర్ ప్రజలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బంద్ పాటించారు. ఉన్మాదం ఎంత ప్రమాదకరమైనదో దేశం గుర్తించింది. మతోన్మాద రాజకీయాలకు ఇది హెచ్చరికగా మారింది.

అమెరికా జోక్యంతో దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం

మే 7 తెల్లవారుజామున 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ప్రాంతాల్లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడులు జరిగాయి. నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించి భారత ఆర్మీ తన శక్తి సామర్థ్యాలను చాటింది. దీనికి పాకిస్తాన్ ప్రతిదాడులు చేసింది. పాకిస్తాన్ అణ్వాయుధ దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. ఇలాంటి స్థితిలో అకస్మాత్తుగా మే 10న కాల్పులు విరమిస్తున్నట్లు భారత్, పాక్ ప్రకటించాయి. ఈ ఇరుదేశాలు ప్రకటించక ముందే 'అమెరికా మధ్యవర్తిత్వంతో రాత్రంతా జరిగిన చర్చలు, సంప్రదింపుల ఫలితంగా భారత్, పాకిస్తాన్‌లు తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయి' అని అమెరికా అధ్యక్షుడు 'ట్రంప్ ట్రూత్ సోషల్' అనే ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశాడు. ఆ తర్వాత మన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కాల్పుల విరమణను ప్రకటించడంతో పహల్గాం ఉగ్రవాదులను ఎక్కడున్నా శిక్షిస్తానన్న ప్రధాని వాగ్దానం నెరవేరకుండానే ఎందుకు విరమించారు? కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు ప్రకటించడమేమిటి? అనే ప్రశ్నల పరంపర పెరిగింది. మే 10న సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ కూడా భారత్, పాక్ విదేశాంగ మంత్రులతో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు ప్రకటించాడు. ఇన్నేళ్ళుగా భారత్, పాకిస్తాన్ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వానికి అవకాశం లేకుండా అనుసరించిన మన విదేశాంగ విధానం సార్వభౌమత్వానికి ప్రతీకగా వుంది. స్వాతంత్ర్యానంతరం నుండి మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని సామ్రాజ్యవాద దేశాలు అనేక ఎత్తులు వేస్తూ వచ్చాయి. ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండానే మన స్వతంత్రతను కాపాడుకుంటూ వచ్చాము. అందుకు నాటి సోవియట్ రష్యా సహకారం కూడా ఒక కారణం. ఈ విధానం మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచింది. వాణిజ్య ప్రయోజనాల బెదిరింపుతో కాల్పులు విరమించారని, అమెరికా సరుకులపై భారతదేశం పన్నులు వేయకుండా అంగీకరించిందని వరుసబెట్టి అమెరికా అధ్యక్షుడు చేస్తున్న ప్రకటనలు మన సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. నిత్యం దేశభక్తి జపం చేసే పాలకులు ఇంతగా అమెరికాకు ఎందుకు సాగిలపడుతున్నారు? ఉగ్రవాదాన్ని అరికడతామని బయలుదేరి స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రమాదం తేవడమేమిటి? ఇంత జరుగుతున్నా ప్రధాని మాత్రం మౌనంగా వుండడం వెనుక రహస్యం ఏమిటి? విదేశాంగ శాఖ చేసిన ప్రకటన కంటి తుడుపు చర్యగా వుంది తప్ప, దేశ సార్వభౌమత్వం ప్రతిధ్వనించేలా లేదు. తన దేశ ఆర్థిక వ్యవస్థ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా ఆసియా ఖండంలో ఆధిపత్యం చెలాయించడానికి మన దేశాన్ని పావుగా వాడుకుంటున్నది. మోడీ ప్రభుత్వం అందుకు తోడ్పడుతున్నది.

సమైక్యతకు సవాళ్ళు

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు అఖిలపక్ష సమావేశాలకు ప్రధాని హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల సమావేశానికి కేవలం బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను మాత్రమే పిలిచారు. పార్లమెంట్ సమావేశం జరిపి వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించడంలేదు. మరోవైపు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 'తిరంగా' యాత్రలను బిజెపి చేపట్టింది. యుద్ధ వార్తలను ఎప్పటికపుడు దేశానికి అందించిన కల్నల్ సోఫియా ఖురేషిపై బిజెపి అనుకూల సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్ జరిగింది. జాతీయ మహిళా హక్కుల కమిషన్ జోక్యం చేసుకుని వారించిన తర్వాత, 'ఉగ్రవాదుల సోదరి'గా మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షా అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కేసు నమోదు చేసినా, ఆయన చెప్పిన క్షమాపణలు మొసలి కన్నీరని ఘాటుగా వాఖ్యానించినా బిజెపి కేంద్ర నాయకత్వంలో చలనం లేదు. ఆయన మీద ఎలాంటి చర్యా లేదు. మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా సైన్యంపై అత్యంత అవమానకర వాఖ్యలు చేశారు. విదేశాంగ శాఖ కార్యదర్శి, సీనియర్ ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ అధికారి విక్రమ్ మిస్రి, అయన కుమార్తెపై చేసిన ట్రోలింగ్‌తో తన ట్విట్టర్ ఖాతానే రద్దు చేసుకున్నారు. ఇంత బరితెగించిన మూకపై ప్రధాని ఒక్క మాట మాట్లాడడంలేదు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చర్చలకు సిద్ధమంటున్న మావోయిస్టులను కాల్చి చంపుతున్నారు. దేశభక్తి, జై జవాన్, భారత మాతాకి జై అనే ఆర్‌ఎస్‌ఎస్ ఈ దుర్మార్గాలపై ఎందుకు మౌనంగా వుంది?

కేంద్రానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటిని ఖండించకపోగా, బిజెపి 'తిరంగా' యాత్రను ప్రభుత్వ యాత్రగా మార్చి లౌకిక శక్తులను దూరం చేసుకుంటున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు చేస్తున్న ఈ దుర్మార్గపు చర్యలను వైసిపి వ్యతిరేకించడం లేదు. బిజెపికి తోడ్పడే చర్యలు అంతిమంగా ఈ మూడు పార్టీలకూ చేటు తెస్తాయని గుర్తించాలి. యుద్ధోన్మాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక శక్తులు రాష్ట్ర వారసత్వ విలువలను సమున్నతంగా నిలపాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

★

సమస్య

లాభాలు దండుకుంటున్న కంపెనీలు పాడెక్కుతున్న కౌలు రైతులు



ఎం. హరిబాబు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కౌలు రైతు ఆత్మహత్య! ముప్పాళ్ళ మండలంలో కౌలు రైతు ఆత్మహత్య! ఇంకొల్లు మండలంలో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం! ఎందుకిలా జరుగుతున్నది?

సుమారు 90 నుండి 150 రోజులు కష్టపడి ఆటుపోట్లను తట్టుకొని పొగాకు పంట సాగు చేశారు. పంట వేయక ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రైతాంగం చుట్టూ తిరిగి 'నల్ల బర్లీ వేయండి. గత సంవత్సరం రేటు ఇంకా రెండు మూడు సంవత్సరాలు ఉంటుంది' అని ప్రోత్సహించారు. ఫలితంగా పొగాకుతో పాటు ఇతర పంటలు వేసే రైతులు అన్నీ వదులుకొని నల్ల బర్లీ పొగాకు ఒక్కటే సాగు చేశారు. గత సంవత్సరం రేటు సంగతి పైవాడికెరుక. ఇప్పుడు ఎంతో కొంతకు కొనే నాథుడు కూడా లేడు. పైగా సంవత్సరం అంతా ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు, ఎరువులు, పురుగు మందుల షాపుల నుంచి అరువు తెచ్చిన రైతులు, కౌలు రైతులు చివరకు కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు. భార్య మెడలో బంగారాన్ని తాకట్టు పెట్టినా సరిపోక అప్పుల వారికి మొహం చూపించలేకపోతున్నారు. కనీసం అడుగు ఆకు అమ్మయినా కూలి డబ్బులు తీరుద్దామంటే అది కూడా దారుణంగా ఉంది. అడుగు ఆకు కోస్తే క్వింటాకి రూ.5000 కూలి అయింది. ఆ అడుగు ఆకుని కంపెనీకి అమ్ముకుంటే కేవలం రూ.2500 వచ్చిందంటే పంట పండించడానికి అయిన ఖర్చు, కూలి కలిపి రాకపోయినా...కూలీలకైన ఖర్చన్నా రాకపోగా అందులో సగం డబ్బు మాత్రమే వచ్చింది. వీటన్నింటి వలన ప్రత్యేకించి కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

నేడు రైతులు కేజీ పొగాకును 30 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఆ కేజీ పొగాకుతో కనీసం 1250 నుండి 2000 సిగరెట్ల వరకూ తయారవుతాయి. అంటే ఒక్కొక్క సిగరెట్టుకు 0.7 గ్రాముల నుండి ఒక గ్రాము వరకు పొగాకు వాడతారు. ఈ క్రమంలో కొంత వృథా అయినా తక్కువలో తక్కువగా సగటున 1250 సిగరెట్లు వస్తాయి. ఒక్కొక్క సిగరెట్టు సగటు ధర రూ.10 అనుకున్నా కేజీ పొగాకు ద్వారా ఉత్పత్తి అయిన 1250 సిగరెట్లను అమ్ముకుంటే కంపెనీకి రూ.12,500 వస్తాయి. రైతులకు పొగాకు కోసం రూ.30 నుండి రూ.100 పోతాయి. అంటే ఒక కేజీ పొగాకు ద్వారా రూ.12,400 ఆదాయం కంపెనీకి వస్తుంది. ఒక ఎకరాకు 12 నుండి 13 క్వింటాళ్ళు పొగాకు పండిస్తున్నారు. అంటే క్వింటా రూ.10,000 చొప్పున 12 క్వింటాళ్లు కొన్నారనుకుంటే రైతులకు రూ.1,20,000 వస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష 50 వేలు అయ్యింది. దాంతో రైతుకు ప్రతి ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేలు నష్టం వస్తుంది. అదే కంపెనీకి కేజీ పొగాకుతో చేసిన 1250 సిగరెట్లు అమ్ముకోవడం ద్వారా రూ.12,400 వస్తుంది. ఎకరా పొగాకు ద్వారా కంపెనీకి రూ.12 లక్షల 40 వేల ఆదాయం వస్తుంది. ఈ అంకెలు కొంచెం నమ్మడానికి కష్టంగా ఉంటుంది. కానీ ఐటిసి కంపెనీ అనేక వ్యాపారాలు చేస్తుంది. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో కంపెనీ రూ.20 వేల 751 కోట్ల నికర లాభం పొందింది. ఆ కంపెనీకి రూ.91,826 కోట్ల విలువ గలిగిన స్థిరాస్తులున్నాయి. ఐటిసి కంపెనీ సీఈఓ జీతం నెలకు రూ.రెండు కోట్ల పైనే. అంటే గంటకు రూ.10 లక్షలు జీతం. మన రైతు సంవత్సరం అంతా ఎండనకా వాననకా ఆరుగాలం కష్టపడి పనిచేసినా...ఆయన గంట జీతం అంత కూడా సంపాదించలేకపోతున్నాడు.



> **ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు.**

క్యాడ్బరీ పరిస్థితి కూడా అలాగే వుంది. నేడు అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలు కేజీ రూ.800 నుంచి రూ.900 రూపాయలు తక్కువ కాకుండా కొంటున్నారు. కానీ మన రాష్ట్రంలో మాండలిస్ కంపెనీ ఈ కోకో గింజలను కేవలం 450 రూపాయలకే కొంటున్నది. ఒక కేజీ కోకో గింజల నుంచి 800 గ్రాముల కోకో నిబ్స్ వస్తాయి. 400 నుండి 500 గ్రాముల కోకో లిక్విడ్ వస్తుంది. వంద గ్రాముల కోకో చాక్లెట్‌లో 70 గ్రాముల కోకో పదార్థాలుంటాయి. వంద గ్రాముల కోకో లిక్విడ్‌తో పది చాక్లెట్లు వస్తాయి. అలాగే మిల్క్ షేక్ అయితే 12 నుంచి 16 ముక్కలు వస్తాయి. చాక్లెట్లు ఒక కేజీకి సుమారుగా 150 ముక్కలు వస్తాయి. అంటే తక్కువలో తక్కువ కంపెనీకి రూ.16 వేలు వస్తాయి. కానీ రైతుకి ఇస్తున్నది కేజీకి రూ.450 మాత్రమే. అంటే రైతుకిచ్చిన దానికి అదనంగా 40 రెట్లు లాభం కంపెనీకి వస్తుంది. మాండలిస్ కంపెనీ 2022-2023లో రూ.1176 కోట్ల నికర లాభం పొందగా, 2023-2024లో రూ.2020 కోట్ల నికర లాభాలు సంపాదించింది. ఆ కంపెనీ కూడా రూ.5.76 లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులున్నాయి. ఈ కంపెనీ షేర్ విలువ కూడా 64.14 డాలర్లకు పెరిగింది. ఈ మధ్య కాలంలో చాక్లెట్ల ధర 22 శాతం నుండి 30 శాతం వరకు పెంచారు. క్యాడ్బరీ కంపెనీ ఎమ్.డి స్థాయి అధికారుల జీతాలు నెలకు రూ.64 లక్షల నుండి రూ.96 లక్షల మధ్యలో ఉన్నాయి. అలాగే ఇతర ఉన్నతాధికారులు జీతాలు కూడా లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ఆ విలువైన ప్రాణాన్ని రైతాంగం బలవంతంగా తీసుకుంటున్నారంటే ప్రభుత్వం, ప్రజలు, సభ్యసమాజం ఆలోచించాలి.

మీటింగ్‌కి వెళ్తున్నారా అని వెటకారంగా పలకరించటం, మంత్రిగారి దగ్గరికి వెళ్తున్నారా, కొనుగోలు ఇంకా ఆలస్యం అవుతుందని హెచ్చరించడం, ధర్నా చేస్తున్నారా ధర ఇంకా పడిపోతుందని బ్లాక్ మెయిల్ చేయడం....ఇదీ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో చేసే ప్రచారం. వాస్తవంగా పొగాకు వేయమని ప్రజల్లో ప్రచారం చేసి, నమ్మించి మోసం చేసినందుకు ఈ కంపెనీ ప్రతినిధుల మీద ఐపిసి సెక్షన్ 426 కేసు పెట్టాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీల ప్రతినిధులు పలు దఫాలు చర్చించారు. అయినా కొనుగోలు వేగవంతం కాలేదు. మంత్రులు చర్చల తర్వాత కూడా కంపెనీలు కొనుగోళ్లు చేయటం లేదు. అంటే ప్రభుత్వ పాత్రని అనుమానించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో...పొగాకు సాగుదారులందరూ ఐక్యంగా పోరాడితేనే పంటకు గత సంవత్సరం ధర సాధించగలుగుతారు.

/ వ్యాసకర్త కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

కవిత్వం

నేలలో ఇంకని నెత్తురు!

యుద్ధంలో ఆయుధాల దెబ్బలకి
దేశం పూర్తిగా విధ్వంసమైంది..
గాజా గాజు పాత్ర ముక్కలై
లక్షల శరీరాలలో శకలాలు గుచ్చుకొని
రక్త సిక్తమై మెలికలు తిరుగుతోంది
పాలస్తీనా దేశ దేహం...!
ఏడాదికి పైగా...
ఇజ్రాయిల్- పాలస్తీనా హమాస్‌ల మధ్య
జరుగుతున్న మారణకాండ ఇంకా ఆగలేదు
మధ్య మధ్యలో కాస్త విశ్రాంతి... తప్ప
ధారా వాహికంగా పోరు కొ.న.సా.గు.తూనే
వుంది
దేశ ప్రజలకు కాసింత కునుకు లేకుండా
చేస్తోంది
ఈ యుద్ధ పర్వంలో...
ఏబది వేలకు పైగా మృతులు
లక్షలాది ప్రజలు క్షతగాత్రులు
నేలలో ఇంకా ఇంకని.. చిత్తడి నెత్తురు
లక్షల కోట్లలో నష్టపోయిన ఆస్తులు
దేశం విడిచి పోతున్న వేలాది మంది
పౌరులు..!
తిండి తిప్పలు లేక..తల్లడిల్లిపోతున్న ప్రజలు
పాలపిండి దొరకక అల్లాడుతున్న పసి కూనలు
ఉపాధి లేక యాచకులుగా మారిన
సామాన్యులు...!
లక్షల చేతులు
నిత్యం ప్రార్థిస్తున్నా.... ఇజ్రాయిల్ ..
హమాస్ పై చేస్తున్న
భౌతిక దాడులు ఆగటంలేదు.!?
కడుపు కాలిన వాడు
ఆకలితో యుద్ధం చేస్తుంటే...
కడుపు నిండిన వాడు...
ఆధిపత్యం కోసం రాత్రీ పగలూ
యుద్ధ భేరిని మోగిస్తూనే ఉన్నాడు!

- జి.సూర్యనారాయణ,
సెల్ : 6281725659.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

సెన్సెక్స్ 770 పాయింట్ల పెరుగుదల

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 769.09 పాయింట్ల లాభంతో 81,721కు చేరింది. నిఫ్టీ సైతం 243 పాయింట్లు పెరిగి 24,853.15 వద్ద ముగిసింది. దీంతో ఇంతక్రితం సెషన్‌లో భారీ నష్టాలు చవిచూసిన మార్కెట్‌కు కొంత ఉపశమనం లభించినట్లయ్యింది. ముఖ్యంగా ఐటి, ఎఫ్ఎంసిజి, ఫైనాన్షియల్, బ్యాంకింగ్ స్టాక్స్ మద్దతు లభించింది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా మినహా మిగిలిన స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటిసి, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.38 డాలర్ల వద్ద నమోదయ్యింది.



లోకేష్ మార్క్‌తో కడప 'మహానాడు'

● 6 అంశాలతో పార్టీకి కొత్త లుక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : టిడిపి మహానాడులో ఆ పార్టీ సమూలంగా మారబోతుందని తెలిసింది. ఇందుకు కడపలో జరగనున్న మహానాడు వేదిక కానుంది. టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ మార్క్ ఈ మహానాడులో పూర్తిగా కనపడనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ మూల సిద్ధాంతం స్ఫూర్తితో ప్రస్తుత ప్రజా అవసరాలకు అనుగుణంగా పార్టీలో కీలక విధాన మార్పులు లోకేష్ ఆధ్వర్యాన జరుగుతున్నట్లు సమాచారం. కీలక నిర్ణయాలు, కొత్త విధానాలతో పార్టీకి లోకేష్ ఆధ్వర్యాన కొత్త లుక్ రాబోతోందనేది పార్టీ వర్గాల నుండి వినిపిస్తున్న మాట. గతానికి భిన్నంగా టిడిపి మహానాడును కడపలో ఈసారి నిర్వహించాలనేది లోకేష్ అభిప్రాయంగా కన్పిస్తోంది. పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి దాన్ని సమర్థవంతంగా నడుపుతూ కార్యకర్తల మనసులో ప్రత్యేక ముద్ర లోకేష్ వేయించుకున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించడంతోపాటు పార్టీని పరుగులు పెట్టించేందుకు అవసరమైన మార్పులు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కూడు, గూడు, గుడ్డ అనే మూల సిద్ధాంతంతో టిడిపిని ఎన్‌టి రామారావు స్థాపించారు. ఎన్‌టిఆర్ ఆశయాలు, చంద్రబాబు ఆలోచనలతోపాటు భవిష్యత్తుకు అవసరమయ్యే కొన్ని కీలక అంశాలను ప్రతిపాదించే ప్రక్రియలో భాగంగా కొన్ని వర్గాలకు పెద్దపీట వేసేందుకు లోకేష్ ప్రయత్నిస్తున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. మహిళలు, రైతులు, యువత, సామాజిక న్యాయం, కార్యకర్తల సంక్షేమం వంటి అంశాలపై ఫోకస్ పెట్టి లోకేష్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. 'నా తెలుగు కుటుంబం' అనే ఐడియాలజీని ప్రతిపాదించనున్నారని తెలుస్తోంది. అదే విధంగా స్త్రీ శక్తి అనే నినాదం కూడా తీసుకురానున్నారు. అన్ని కులాలకు సామాజిక సమన్యాయం పై ఐడియాలజీని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే 'పేదలసేవ-సోషల్ రీఇంజనీరింగ్' అనే నినాదం తీసుకురానున్నారు. పార్టీలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన చర్యలు, ఐడియాలజీను 'యువగళం' పేరుతో రూపొందించనున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం, సాంకేతికంగా రైతును బలోపేతం చేయడం వంటి అంశాలపై 'అన్నదాతకు అండ' పేరుతో మరో ఐడియాలజీని తీసుకురానున్నారు. 'కార్యకర్తే అధినేత' అనేది పార్టీ నినాదం, విధానంగా ఉండబోతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మహానాడులో 19 తీర్మానాలు

కడపలో ఈ నెల 27 నుంచి జరగనున్న టిడిపి మహానాడులో 19 తీర్మానాలను ఆ పార్టీ ప్రవేశపెట్టనుంది. మహానాడు తీర్మానాల కమిటీ ఆ పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఆధ్వర్యాన టిడిపి కార్యాలయంలో శుక్రవారం సమావేశమైంది. మొత్తం 19 తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో 14 తీర్మానాలు రాష్ట్రానికి సంబంధించినవి కాగా, 5 తెలంగాణకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన, పి-4 విధానం, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానం (బనకచర్ల ప్రాజెక్టు), సాంకేతికతో వ్యవసాయం, విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు, సహజ వనరుల పరిరక్షణ-అక్రమాలపై విచారణ, కూటమి ప్రభుత్వంపై వైసిపి విషప్రచారం వంటి అంశాలపై మహానాడులో చర్చించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది. వీటితోపాటు తెలుగుజాతికి ఎన్‌టిఆర్ గర్వకారణం అనే అంశంపై కూడా చర్చించనుంది. అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన విధానాలపై చర్చ జరగనుంది.

టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఏంజెలో మాథ్యూస్

కొలంబో: శ్రీలంక స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ రిటైర్మెంట్ ప్రకటించాడు. జూన్ 17న గాలే వేదికగా బంగ్లాదేశ్‌తో జరగనున్న తొలి టెస్టు అనంతరం రెడ్ బాల్ క్రికెట్ నుంచి మాథ్యూస్ తప్పుకోనున్నాడు. ఈ విషయాన్ని మాథ్యూస్ శుక్రవారం వెల్లడించాడు. "జూన్‌లో బంగ్లాదేశ్‌తో జరిగే తొలి టెస్ట్ మ్యాచ్ అనంతరం రెడ్ బాల్ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. ఇప్పటికే ఈ విషయాన్ని సెలక్టర్లకు తెలియజేశాను. అయితే వైట్ బాల్ ఫార్మాట్‌లో మాత్రం జట్టుకు అవసరమైనప్పుడు కచ్చితంగా సెలక్షన్‌కు అందుబాటులో ఉంటాను. మరో టాలెంటెడ్ యంగ్ క్రికెటర్‌కు అవకాశమివ్వాలని ఈ నిర్ణయం తీసుకున్నాను. గత 17 ఏళ్లగా శ్రీలంక క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. నా కెరీర్ అంతటా మద్దతుగా నిలిచిన శ్రీలంక క్రికెట్, నా తోటి ఆటగాళ్లకు, అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని మాథ్యూస్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. శ్రీలంక తరఫున 118 టెస్టులు ఆడిన 44 సగటుతో 8167 పరుగులు చేశాడు. 33 వికెట్లు కూడా తీశాడు. 2009లో ఆస్ట్రేలియాపై టెస్టు అరంగేట్రం చేసిన మాథ్యూస్.. 34 టెస్ట్ మ్యాచ్‌ల్లో శ్రీలంక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ఆర్‌బిఐ గల్లా గుల్ల..!

- మోడీకి ఆర్‌బిఐ బంఫర్ గిఫ్ట్
- రూ.2.10 లక్షల కోట్ల డివిడెండ్
- ఆమోదించిన సెంట్రల్ బ్యాంక్ బోర్డు



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఖజానాను ఖాళీ చేయాలనే ప్రధాని మోడీ లక్ష్యం క్రమంగా నెరవేరుతోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను ఆర్‌బిఐ రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్‌ను ప్రకటించింది. ఇంతక్రితం 2023-24లో రూ.2.10 లక్షల కోట్లు కేటాయించింది. దీంతో పోల్చితే ఒక్క సారిగా అదనంగా దాదాపు రూ.60 వేల కోట్లు పెంచింది. 2022-23కు గాను ఆర్‌బిఐ రూ.87,416 కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించింది. ప్రతీ ఏడాది ఈ మొత్తాన్ని భారీగా పెంచుతూ వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ఆర్‌బిఐ, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల నుంచి రూ.2.56 లక్షల కోట్ల డివిడెండ్ ఆదాయాన్ని అంచనా వేసింది. దీంతో పోల్చితే అంచనాలు మించి ఆర్‌బిఐ తన స్వామి భక్తిని చూపించిందని స్పష్టమవుతోంది.

ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో శుక్రవారం ఆర్‌బిఐ బోర్డు డైరెక్టర్ల 616వ సెంట్రల్ బోర్డు సమావేశం జరిగింది. ఆర్‌బిఐ అధికారులు, ప్రపంచ, దేశీయ ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. ఇందులో మోడీ ప్రభుత్వానికి రూ.2,68,590.07 కోట్ల మిగులును బదిలీ చేయాలని ఆమోదించారు.

రూపాయి మారక విలువను కాపాడేందుకు ఆర్‌బిఐ ఇటీవల రికార్డు స్థాయిలో డాలర్ అమ్మకాలు చేపట్టింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి భారత్ వద్ద రికార్డ్ స్థాయిలో 704 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలున్నాయి. కాగా.. 2024 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2025 మధ్య రికార్డ్ స్థాయిలో 371.6 బిలియన్ డాలర్లను విక్రయించిందని అంచనా. పెద్ద ఎత్తున నగదు లభ్యత కార్యకలాపాలు చేపట్టింది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమీషన్స్, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బిఐకు రాబడి వస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు, రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు, పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు, తరుగుదలకు కేటాయింపులు తదితర వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తుంటారు. ఈ మిగులు నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేంద్రానికి ఆర్‌బిఐ ప్రతి సంవత్సరం బదలాయిస్తుంది. అయితే ఇటీవలి ఏళ్లలో ఆర్‌బిఐ గవర్నర్లు ప్రభుత్వం పట్ల విదేయతను చాటుకోవడానికి భారీగా డివిడెండ్‌ను ప్రకటిస్తూ.. రిజర్వు బ్యాంక్‌ను నిర్వీరం చేస్తున్నారనే విమర్శలు పెరిగాయి. అధిక డివిడెండ్‌ను ప్రకటించాలని మోడీ సర్కార్ డిమాండ్‌ను విభేదించిన గవర్నర్లు ఇది వరకు రాజీనామా చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ అంశంలోనే రఘురాం రాజన్ 2016లో, 2018లో ఉర్జిత్ పటేల్ అర్ధంతరంగా వైదొలిగారు. ఆర్‌బిఐ స్వయంప్రత్తిని కేంద్రం శాసిస్తోందని.. దెబ్బతీస్తోందని విమర్శించారు. ఆ తర్వాత వారు ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించిన విషయం తెలిసిందే.

సజ్జల ఆక్రమణ భూములపై డ్రోన్ సర్వే!

- ఇరిగేషన్, డికెటి భూములపై వీడియో రికార్డింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి ఆక్రమణ భూములపై ప్రభుత్వం డ్రోన్ సర్వే నిర్వహించింది. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని సుమారు 200 ఎకరాల అటవీ ప్రాంతంలోని సజ్జల ఎస్టేట్ సమీపంలోని 63.79 ఎకరాల ఆక్రమణలోని 52.45 ఎకరాల కుంట, ఫారెస్ట్ భూములపై వివాదం ఏర్పడిన సంగతి తెలిసిందే. టిడిని కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం 2025 జనవరి నుంచి మే నెల వరకు జెసి ఆధ్వర్యంలో ల్యాండ్ అండ్ సర్వే, రిజిస్ట్రేషన్, తహశీల్దార్, ఫారెస్ట్ అధికారులతో పలు దఫాలుగా సర్వే చేసి హద్దులను నిర్ణయించింది. 63.79 ఎకరాల ఆక్రమణ వాస్తవమేనని కలెక్టర్ నివేదిక అందించిన సంగతి తెలిసిందే. ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. ఆక్రమణదారుల నుంచి బెదిరింపులు వచ్చాయనే ఆరోపణల నేపథ్యంలో డ్రోన్ల సహాయంతో వీడియో రికార్డింగ్ చేసినట్లు తెలుస్తోంది.

పాక్ నిధులపై ఏకగ్రీవ నిర్ణయమే

- ఓటింగ్ జరలేదన్న ఐఎంఎఫ్

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌కు అదనంగా నిధులు అందజేయాలని ఈనెల 9న ఎగ్జిక్యూటివ్ బోర్డు తీసుకున్న నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకున్నదేనని, ఓటింగ్ జరగలేదని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అధికారికంగా ధ్రువీకరించింది. ఈ నిధులను వినియోగించుకోవడంలో పాకిస్తాన్‌కు పేలవమైన రికార్డు వుందని పేర్కొంటూ ఈ ఏకగ్రీవ నిర్ణయ ప్రక్రియకు భారత్ గైర్హాజరైంది. ఈ నెల 22న వాషింగ్టన్‌లో ఐఎంఎఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలీ కొజాక్ నిర్వహించిన పత్రికా సమావేశంలో భాగంగా ఈ సమాచారం వెల్లడించారు. ఇదేమీ తాజా రుణం కాదని, గతంలో కుదిరిన ఒప్పందానికి కొనసాగింపేనని, అందుకే ఓటింగ్ జరగలేదని ఐఎంఎఫ్ వివరించింది. ఉగ్రవాద కార్యకలాపాలకు అందే ఆర్థిక నిధులపై పర్యవేక్షణ జరిపే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) జూన్‌లో జరపనున్న ప్లీనరీ సమావేశంలో పాక్ అంశాన్ని పరిశీలించాలని కోరుతూ భారత్ ఒక అభ్యర్థనను పంపనుంది. మరింత పరిశీలన జరపాల్సిన దేశాల జాబితా (గ్రే లిస్ట్) లోకి పాక్‌ను తిరిగి చేర్చాలని భారత్ కోరనుంది.



జర్మనీతో ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపు

- జర్మనీ ఛాన్సలర్‌తో జై శంకర్ భేటీ

బెర్లిన్ : జర్మనీతో ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాలని, విస్తరించుకోవాలని భారత్ భావిస్తోందని విదేశాంగ మంత్రి జై శంకర్ తెలిపారు. మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం జర్మనీలో పర్యటిస్తున్న జై శంకర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌తో సమావేశమయ్యారు. ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి జర్మనీ సంఘీభావం ప్రకటించడాన్ని అభినందించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. జర్మనీ ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి కేథరిన్ రిచెతో కూడా భేటీ అయ్యారు. పారిశ్రామిక భాగస్వామ్యాన్ని, సంయుక్త సహకారాన్ని మరింత పెంచుకుంటూ మరిన్ని సరఫరా చెయిన్‌లను నిర్మించుకోవడానికి గల మార్గాలను చర్చించినట్లు జై శంకర్ తెలిపారు. మెర్జ్‌కు విదేశీ, భద్రతా విధాన సలహాదారైన గుంటెర్ సత్తార్‌తో కూడా అర్థవంతమైన చర్చలు సాగించినట్లు చెప్పారు. తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంతోసహా ప్రధాన అంతర్జాతీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని తెలిపారు. ఈ అనిశ్చితి ప్రపంచంలో

సుస్థిరతకు భారత్, జర్మనీల మధ్య భాగస్వామ్యం మరింత పెరగడం కీలకమైన అంశంగా వుందని అన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పరస్పర విశ్వాసాన్ని, సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి కలిసి కృషిచేయాలని జై శంకర్ పేర్కొన్నారు. గురువారం జర్మనీ పార్లమెంట్ సభ్యులతో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాల వృద్ధికి వారు అందిస్తున్న తోడ్పాటును ప్రశంసించారు. తీవ్రవాదం ఏ రూపంలో తీవ్రవాదం వున్నా దానిపై భారత్ ధృఢమైన పోరాటం సాగిస్తుందని వారికి స్పష్టం చేశారు.

కోటాలోనే విద్యార్థుల మరణాలెందుకు?

- రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

జైపూర్ : విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలోనే ఎందుకు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన కోటాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 14 మంది విద్యార్థుల ఆత్మహత్యపై అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని నిలదీసింది. వీటిని తేలికగా తీసుకోవద్దని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విద్యార్థుల ఆత్మహత్యలపై నమోదైన పిటిషన్లపై న్యాయమూర్తులు జెబి పార్దివాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. విద్యార్థుల మరణాలు చాలా తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. వీటిని తేలిగ్గా తీసుకోకూడదని పేర్కొంది. 'మీరు ఏం చేస్తున్నారు..? ఇంత మంది పిల్లలు కోటాలో మాత్రమే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు..? దీని గురించి మీరు ఆలోచించలేదా..?' అంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదిని జస్టిస్ పార్దివాలా ప్రశ్నించారు. 'కోటాలో ఇప్పటి వరకూ ఎంత మంది యువ విద్యార్థులు మరణించారు..? విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు..?' అంటూ కోర్టు ప్రశ్నించింది. ఐఐటి ఖరగ్‌పూర్‌కు చెందిన 22 ఏళ్ల విద్యార్థి ఈ నెల 4న ఉరివేసుకుని మరణించగా, 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు జరిగిందని ధర్మాసనం సంబంధిత పోలీసు అధికారిని ప్రశ్నించింది. మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ... ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. పోలీసు అధికారి, ఐఐటి ఖరగ్‌పూర్ తరపు న్యాయవాది ఇచ్చిన వివరణలపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలు పాటించకపోవడంపై జులై 14న సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీ చేసింది. ఆత్మహత్య కేసుల పరిశీలనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపింది.

దూరాన్ని బట్టి జొమాటో బాదుడు



న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక జొమాటో తన వినియోగదారులపై అదనపు భారం మోపడానికి సిద్ధమయ్యింది. ఇకపై దూరాన్ని బట్టి ఫీజు ఉంటుందని తెలిపింది. 4 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం డెలివరీ చేసే ఫుడ్ ఆర్డర్‌ల కోసం 'లాంగ్ డిస్టెన్స్ సర్వీస్ ఫీజు' పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. 150 రూపాయల కంటే ఎక్కువ విలువైన ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు బుక్ చేసుకునే హోటల్ దూరం 4 నుంచి 6 కిలోమీటర్ల మధ్య ఉంటే రూ.15 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ దూరం ఉంటే.. దూరాన్ని బట్టి అదనపు ఛార్జీ రూ.25, 35కు మారుతుందని తెలిపింది. ఈ ఛార్జీ కూడా వినియోగదారులు ఎంత ధరకు ఫుడ్ బుక్ చేసుకున్న దానిపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది.

మహ్మద్ షమి కష్టమే?

- ఫిట్‌నెస్ సమస్యతో ఇంగ్లాండ్ టూర్‌కు దూరం
- నేడే ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు భారత టెస్టు జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : మరో పది రోజుల్లో ఐపీఎల్ హంగామా ముగియనుండగా.. ఆ వెంటనే రెడ్‌బాల్ జోరు ఊపందుకోనుంది. జూన్ 11 నుంచి ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జరుగనుండగా.. జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్‌లు ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్‌లో పర్యటించే టీమ్ ఇండియా టెస్టు జట్టును నేడు (శనివారం) ఎంపిక చేయనున్నారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో సమావేశం కానున్న ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ.. మధ్యాహ్నం 1.30 గంటలకు మీడియా ముందుకు రానుంది. ఐదు మ్యాచుల సిరీస్‌కు భారత టెస్టు జట్టును సెలక్షన్ కమిటీ చైర్మెన్ అజిత్ అగార్కర్ ప్రకటించనున్నాడు.

కొత్త కెప్టెన్ ఎవరు? : సీనియర్ సెలక్షన్ కమిటీ ఎదుర్కొంటున్న కీలక సవాళ్లలో కెప్టెన్సీ ఒకటి. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి టెస్టులకు అనూహ్యంగా వీడ్కోలు పలికారు. దీంతో టాప్ ఆర్డర్‌లో రెండు బ్యాటింగ్ స్థానాలు సహా కెప్టెన్సీ సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత సెలక్షన్ కమిటీపై పడింది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్, పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ రేసులో ఉన్నారు. కొత్త కెప్టెన్‌తో కలిసి సెలక్షన్ కమిటీ మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

షమికి లేదు చోటు? : భారత పేస్ విభాగంలో కీలక పేసర్ మహ్మద్ షమి. ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న మహ్మద్ షమి ఈ ఏడాది ఐపీఎల్‌లో తేలిపోయాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఐపీఎల్18లో ఆడుతున్న మహ్మద్ షమి రెడ్‌బాల్ ఫార్మాట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ సాధించలేదని సమాచారం. శుక్రవారం లక్నోలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉండగా.. షమి ఫిట్‌నెస్ పర్యవేక్షణకు బీసీసీఐ ఓ వైద్యాధికారిని అక్కడికి పంపినట్టు సమాచారం. సుదీర్ఘ స్పెల్స్ పాటు బౌలింగ్ చేయగల ఫిట్‌నెస్ షమలో లేదని వైద్య నివేదికలో తేల్చిగా.. షమిని ఇంగ్లాండ్ టూర్‌కు ఎంపిక చేయటం లేదని సమాచారం.

కుర్రాళ్లకు చాన్స్ : విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రిటైర్‌మెంట్‌తో టెస్టు జట్టులో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. ఓపెనర్‌గా రోహిత్ శర్మ, నం.4 బ్యాటర్‌గా విరాట్ కోహ్లి స్థానాలను భర్తీ చేయటం కుర్రాళ్లకు కఠిన సవాల్. శుభ్‌మన్ గిల్‌ను నం.4 స్థానంలో ఆడించి.. ఓపెనర్‌గా, నం.3 బ్యాటర్‌గా సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్‌లకు అవకాశం కల్పించే సూచనలు కనిపిస్తున్నాయి. టెస్టు క్రికెట్‌కు అవసరమైన నిలకడ, ఏకాగ్రత సాయి సుదర్శన్‌లో పుష్కలంగా ఉన్నాయి. ఐపీఎల్‌లోనూ అద్భుత ప్రదర్శన చేస్తున్న సాయి సుదర్శన్ తొలిసారి భారత టెస్టులో చోటు ఆశిస్తున్నాడు. అజిత్ అగర్కార్ ప్యానల్ సైతం సాయి సుదర్శన్‌ను ఇంగ్లాండ్‌కు పంపించేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది!.

మరోసారి క్షమాపణలు చెప్పిన విజయ్ షా

- భాషాపరమైన తప్పిదమేనని వ్యాఖ్య

భోపాల్ : ఆపరేషన్ సిందూర్‌పై సమాచారాన్ని జాతీయ మీడియాకు తెలియజేసిన సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై అవమానకరమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా శుక్రవారం మరోసారి బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలను 'భాషాపరమైన తప్పిదం'గా ఆయన వ్యాఖ్యానించారు. తన వ్యాఖ్యలపై దుమారం రేగిన నేపథ్యంలో మంత్రి మొదటిసారి చెప్పిన క్షమాపణలను తిరస్కరించిన సుప్రీం కోర్టు ఆయనపై దర్యాప్తుకు సిట్‌ను ఏర్పాటు చేసింది. తాజాగా మరోసారి ఆయన క్షమాపణలు చెప్పారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఊచకోత నన్ను తీవ్రంగా బాధ పెట్టింది. కలిచివేసింది. నా దేశం పట్ల, భారత సైన్యం పట్ల నాకు అపారమైన గౌరవం వుంది. నేను మాట్లాడిన మాటలు కమ్యూనిటీని, మతాన్ని, దేశ ప్రజలను బాధించాయి. అది నా భాషాపరమైన తప్పిదమే." అని విజయ్ షా ఎక్స్‌లో వీడియో స్టేట్‌మెంట్ ఇచ్చారు.

"ఏ మతాన్ని లేదా కులాన్ని లేదా కమ్యూనిటీని బాధపెట్టాలన్నది నా ఉద్దేశం కాదు. యథాలాపంగా ఈ మాటలన్నందుకు మొత్తంగా భారత సైన్యానికి, సోదరి కల్నల్ సోఫియాకు, దేశ ప్రజలకు నేను నిజాయితీగా క్షమాపణలు చెబుతున్నాను. మరోసారి చేతులు జోడించి క్షమాపణలు చెబుతున్నా" అని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 20న సుప్రీం ఆదేశాల మేరకు ముగ్గురితో సిట్ ఏర్పడింది. సిట్‌కు నాయకత్వం వహిస్తున్న ఇనస్పెక్టర్ జనరల్ ప్రమోద్ వర్మ మాట్లాడుతూ, దర్యాప్తు ప్రారంభమైందని చెప్పారు. సాక్ష్యాధారాలను సేకరిస్తున్నామన్నారు. విజయ్ షాను ఇంకా దర్యాప్తునకు పిలవాల్సి వుందని మరో ఐపిఎస్ అధికారి వాహిని సింగ్ చెప్పారు. అంతకుమించి వివరాలను ఇద్దరు అధికారులు చెప్పలేదు. 28కల్లా దర్యాప్తు నివేదికను సుప్రీంకు అందజేయాల్సి వుంది.

నిషేదిత సిగరెట్లు స్వాధీనం

- బీహార్ నుంచి గుంటూరుకు అక్రమ రవాణా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



బీహార్ నుంచి అక్రమ రవాణా అవుతున్న రూ.1.97 కోట్ల విలువైన నిషేధిత సిగరెట్లను గుంటూరుకు సమీపంలోని బుడంపాడు వద్ద విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంట్, జిఎస్‌టి అధికారులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. జిల్లా విజిలెన్సు అధికారి ఎ.సూర్య శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతుల్లేని జిటిపిఎల్ స్టెప్, జిటిపిఎల్ విమల్ సిగరెట్లను బీహార్ రాజధాని పాట్నా నుంచి గుంటూరుకు భారీ వాహనంలో తీసుకొచ్చారు. బుడంపాడు వద్ద గల అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని గొడోన్‌లో అన్‌లోడ్ చేస్తుండగా అధికారులు దాడి చేశారు. బీహార్‌కు చెందిన సుభాష్ నుంచి గుంటూరుకు చెందిన వ్యాపారి సూర వెంకటేశ్వరరావుకు సరఫరా చేస్తున్నట్టు నిర్ధారించారు. వెంకటేశ్వరావుతోపాటు ఆయన అనుచరుడు నిరంజన్, లారీ డ్రైవర్ ధరందేవ్, బీహార్ వ్యాపారి సుభాష్‌లను పాత గుంటూరు పోలీసులకు అప్పగించారు. ఈ వ్యాపారం ఎంత కాలం నుంచి జరుగుతుందనే కోణంలో విచారణ చేస్తున్నారు. పన్నులు వేగవేసి సిగరెట్లను అక్రమంగా రవాణ చేస్తున్నందున జిఎస్‌టి అధికారులు కూడా ఫిర్యాదు చేశారు.

గిరిజన సలహా మండలి పునరుద్ధరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలిని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఛైర్మన్ సహా 18 మంది సభ్యులతో మండలిని నియమించింది. గిరిజన సలహా మండలికి ఛైర్మన్‌గా గిరిజన సంక్షేమశాఖ మంత్రి, సభ్యులుగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ (భారత ప్రభుత్వం), నాన్ అఫిషియల్ సభ్యులుగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే ఎం విశ్వేశ్వరరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, బుజ్జిరెడ్డి, ధారునాయక్, మాసరాపు సుబ్బయ్య, మోరుజు తేజోవతి, నందివాడ కృష్ణబాబు, నిమ్మల కొరా, పొన్నుర్సు వెంకటపతి, రావుల కొండలు, సుభావత్ సోమలా నాయక్, సవర మల్లయ్య ఉన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల కేసు

- వంశీని విచారించిన పోలీసులు

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లాలో గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నిందితుడుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ను పోలీసులు శుక్రవారం కస్టడీలోకి తీసుకున్నారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు ఆయనను కంకిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. పిటి వారెంట్‌పై రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ నూజివీడు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం విచారణ నిమిత్తం కంకిపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు అధికారులు ఆయనను ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. నకిలీ పట్టాల కేసులో ఎవరి పాత్ర ఎంతవరకు ఉంది? తనతోపాటు ఇంకెవరైనా ఇందులో ఉన్నారా? అనే ప్రశ్నలు పోలీసులు అడిగారని తెలిసింది. తనకు తెలియదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వంశీని శనివారం కూడా విచారించనున్నారు.

విచక్షణ కలిగిన వారెవరూ ఇలా చేయరు!

- పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయిల్ తీరుపై సెంటర్ లెఫ్ట్‌నేత తీవ్ర వ్యాఖ్యలు

టెల్ అవీవ్ : గాజాపై సుదీర్ఘకాలంగా దాడులు కొనసాగిస్తూ అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న ఇజ్రాయిల్‌కు స్వదేశంలోనూ నిరసనలు, విమర్శలు ఎదురవుతునే వున్నాయి. హమాస్ అదుపులో వున్న బందీలందరినీ విడిపించడంలో విఫలమయ్యారంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై ఇప్పటివరకు రాజకీయ నేతలు విమర్శలు చేశారు. తాజాగా పాలస్తీనియన్ల దుస్థితిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ ప్రముఖ ఇజ్రాయిల్ నేత తీవ్రంగా వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా పాలస్తీనా పౌరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టనష్టాలను ప్రధానంగా పేర్కొంటూ సెంటర్-లెఫ్ట్ ప్రతిపక్ష నేత యార్ గోలన్ చేసిన వ్యాఖ్యలు వ్యవస్థను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఇజ్రాయిల్ ప్రభుత్వ రేడియో స్టేషన్ రెషెట్ బెట్‌తో గోలన్ మాట్లాడుతూ, రాన్రానూ తన చర్యలు, విధానాలతో ఇజ్రాయిల్ నిషేధిత దేశంగా మారుతోందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజం మొత్తంగా ఇజ్రాయిల్‌ను తిరస్కరిస్తోందని అన్నారు. "వివేచన, విచక్షణ కలిగిన దేశం నిరంతరంగా అమాయకులపై దాడులు కొనసాగించదు, అభం శుభం తెలియని చిన్నారులను అంతమొందించడాన్ని ఒక హాబీగా మార్చుకోదు. జనాభాను బహిష్కరించడాన్ని లక్ష్యాలుగా నిర్దేశించదు." అని గోలన్ వ్యాఖ్యానించారు. తన వ్యాఖ్యలు సైన్యాన్ని ఉద్దేశించి కాదని, మితవాద ప్రభుత్వం గురించే అని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ గురించి వ్యతిరేకంగా గతంలో కూడా విమర్శలు వచ్చాయి. మాజీ రక్షణ మంత్రి, మిలటరీ చీఫ్ మోషె యాలన్ కూడా పాలస్తీనా జాతి ప్రక్షాళనకు ఇజ్రాయిల్ పాల్పడుతోందని విమర్శించారు. గోలన్ వ్యాఖ్యలను నెతన్యాహు ఖండించారు. యుద్ధాన్ని ముగించి అందుకు ప్రతిగా హమాస్ చెరలో మిగిలిన 58 మంది బందీలను విడుదల చేయించాలన్నది ప్రజల అభిమతంగా వుంది. ఒపీనియన్ పోల్స్‌లోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాలస్తీనా కోసమే ఇదంతాచేశా !
ఎంబసీ సిబ్బంది కాల్చివేత కేసులో నిందితుడు

గాజా కోసం, పాలస్తీనా కోసమే ఇదంతా చేశానని వాషింగ్టన్‌లో మ్యూజియం వెలుపల ఇజ్రాయిల్ ఎంబసీ సిబ్బంది ఇద్దరిని కాల్చి చంపిన నిందితుడు వ్యాఖ్యానించాడని అధికారులు తెలిపారు. కాల్పుల అనంతరం పారిపోతున్న ఎలియాస్ రొడ్రిగజ్ (31)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో 'పాలస్తీనాకు స్వేచ్ఛనివ్వాలి' అంటూ నినాదాలు చేశాడు. కాల్పుల్లో మరణించిన వారిద్దరు త్వరలో పెళ్ళి చేసుకోబోతున్న జంట అని ఇజ్రాయిల్ రాయబారి లెయిటర్ తెలిపారు.

50మందికి పైగా మృతి?
29 మంది ఆకలి చావులు : గాజా ఆరోగ్యశాఖ

ఉత్తరగాజాలోని నివాస భవంతిపై జరిగిన వైమానిక దాడిలో 50మందికి పైగా పాలస్తీనియన్లు మరణించడమో లేదా గల్లంతవడమో జరిగిందని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. సరైన ఆహారం అందక ఇటీవలి రోజుల్లో మరణించిన 29మందిని ఆకలి మృతులుగా పరిగణించినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. వీరిలో చిన్నారులు, వృద్ధులు ఉన్నారు.

నవంబర్ 1 నాటికి
పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ

- ఎల్‌డిఎఫ్ 4వ వార్షికోత్సవ వేడుకల్లో పినరయి విజయన్

తిరువనంతపురం : ఈ ఏడాది నవంబర్ 1 నాటికి కేరళ పేదరిక రహిత రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. తిరువనంతపురంలో శుక్రవారం నిర్వహించిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాలుగో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. దేశంలోనే కేరళ అత్యల్ప పేదరిక స్థాయిని కలిగి ఉందని తెలిపారు. బలమైన, సమర్థవంతమైన ప్రజా పంపిణీ వ్యవస్థతో ఇది సాధించగలిగామని, ఈ అభివృద్ధిని గత కొన్నేళ్లుగా తమ ప్రభుత్వం స్థిరంగా బలోపేతం చేస్తోందని చెప్పారు. ప్రజా భాగస్వామ్య విధానాలను పారిశ్రామిక వ్యూహాలతో మిళితం చేయడం ద్వారా కేరళ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు.



వార్షికోత్సవ వేడుకలకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న పినరయి విజయన్

అతి తక్కువ ద్రవ్యోల్బణం

దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం కేరళ అని, నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా మారుతుందని ఉద్ఘాటించారు. 2016లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టిన సమయంలో .. రాష్ట్రంలో పెట్టుబడి పరిస్థితులను మార్చడం ఆందోళన కలిగించే కీలకాంశాల్లో ఒకటిగా ఉందని గుర్తు చేసుకున్నారు. ఆందోళనలు తొలగించేలా పారిశ్రామిక వేత్తలు, వాటాదారులతో తమ ప్రభుత్వం వివరణాత్మక చర్చలు జరిపిందని, పథకాల రూపకల్పనలో వారి అభిప్రాయాలను కూడా చేర్చామని చెప్పారు. ఫలితంగా రాష్ట్రంలో వ్యాపారాలను సులభతరం చేసేందుకు అనువుగా చట్టాలను, నిబంధనలను సవరించామని, అనేక నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టామని తెలిపారు. పథకాల్లో మార్పులతోపాటు పారిశ్రామికీకరణకు అనుగుణంగా సామాజిక దృక్పథాన్ని కూడా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించామని, అందుకే కేరళలో 'ఇయర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్'ను ప్రారంభించామని అన్నారు. ఈ నమూనాను కేంద్రప్రభుత్వం జాతీయ నమూనాగా గుర్తించిందని విజయన్ పేర్కొన్నారు.

కేరళకు కేంద్రం మొండిచేయి

పన్నుల ఆదాయ పంపిణీలో రాష్ట్రానికి లభించాల్సిన హక్కును కేంద్రం నిరాకరించిందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పన్ను వాటాను న్యాయంగా కేంద్రప్రభుత్వం కేటాయించి వుంటే, 2022-23లో రూ.2,282 కోట్లు, 2023-24లో రూ.2.071 కోట్లు అదనంగా వచ్చేవని చెప్పారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల మొత్తం పన్ను ఆదాయంలో కేరళ వాటా 3.7 శాతమని తెలిపారు. ఇదే సమయంలో కేంద్రం నుండి కేరళకు వచ్చిన పన్ను వాటా వరుసగా 1.53 శాతం, 1.13 శాతం మాత్రమేనని చెప్పారు. కేరళ జనాభా ఆధారంగా రాష్ట్రానికి 2.7శాతం వాటా రావాల్సి వుందని, ఇది అదనపు డిమాండ్ కాదని, కేరళకు రావాల్సిన నిజమైన వాటా అని వివరించారు.

రాజ్ కసిరెడ్డికి సుప్రీంలో దక్కని ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర మద్యం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తన అరెస్టును సవాల్ చేస్తూ రాజ్ కసిరెడ్డి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. అలాగే తన కొడుకు అరెస్టు సమయంలో నిబంధనలు పాటించలేదంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ రెండు పిటిషన్లపై గత సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. రెగ్యులర్ బెయిల్ వంటి విషయాలు హైకోర్టులో చూసుకోవాలని, ఈ విషయాలను తాము ప్రస్తావించడం లేదని స్పష్టం చేసింది. మద్యం కేసులో సిఆర్‌పిసి 160 ప్రకారం హైదరాబాద్‌లో ఉంటున్న తనకు నోటీసులు జారీ చేసే అధికారం ఎపి సిఐడికి లేదంటూ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి పంపించే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని పేర్కొంది. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదించగా.. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు మహేష్ జఠ్మలాని, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సజ్జల భార్గవ్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరణ

సజ్జల భార్గవ్‌రెడ్డికి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు నిరాకరించింది. సంబంధిత కోర్టును ఆశ్రయించేందుకు భార్గవ్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది. అయితే అప్పటి వరకు అరెస్టు నుంచి జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి ధర్మాసనం మధ్యంతర ఉపశమనం ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు భరించరాని స్థాయికి వెళ్లాయని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. భార్గవ్ పోస్టులపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి తప్పులను వ్యవస్థ క్షమించదని, తప్పక శిక్షిస్తుందని పేర్కొంది. ఇది రాజకీయ అంశాలతో కూడిన కేసు, 2021 కేసు అని భార్గవ్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఇక్కడ రాజకీయాలు అప్రస్తుతమని ధర్మాసనం పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపింది.

సినిమా హాళ్లు బంద్‌పై విచారణ

- మంత్రి దుర్గేష్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో జూన్ ఒకటి నుంచి సినిమా హాళ్లు బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్న విషయంపై విచారణ చేపట్టాలని, ఈ నిర్ణయం వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలని సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్.. హోంశాఖ ముఖ్యకార్యదర్శికి దిశానిర్దేశం చేశారు. హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ముందు థియేటర్లు మూసివేయాలని ఓ నలుగురు ఒత్తిడి చేస్తున్నారనే వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ పరిణామంతోపాటు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక కార్టెల్‌గా ఏర్పడి అవాంఛనీయ నిర్ణయాలు తీసుకోవడం గురించి విచారణ చేయాలని పేర్కొన్నారు. సినిమా హాల్స్ మూసివేత వల్ల ఎన్ని సినిమాలు ప్రభావితమవుతాయి, ఎంత ట్యాక్స్ రెవెన్యూకు విఘాతం కలుగుతుందనే కోణంలోనూ వివరాలు సేకరించాలని తెలిపారు.

ఆ మహిళా అధికారిని సర్వీస్ నుండి తొలగించొద్దు

- కేంద్రానికి, ఐఎఎఫ్‌కు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : ఆపరేషన్ బాలాకోట్, ఆపరేషన్ సిందూర్‌ల్లో భాగమైనప్పటికీ శాశ్వత కమిషన్ నిరాకరించబడిన మహిళా అధికారిని సర్వీస్ నుండి తొలగించవద్దని కేంద్రాన్ని, భారత వైమానిక దళాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తనకు శాశ్వత కమిషన్ నిరాకరిస్తూ వివక్ష ప్రదర్శిస్తున్నారని వింగ్ కమాండర్ నికితా పాండే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఈ విషయమై కేంద్రం, ఐఎఎఫ్‌ల నుండి సమాధానాలు కోరింది. ఇలాంటి అధికారులకు తమ సర్వీస్‌కు సంబంధించి అనిశ్చితి వుండడం మంచిది కాదని బెంచ్ పేర్కొంది. ఇది సామాన్యుల సూచన అని, ఎందుకంటే తాము నిపుణులం కాదని వ్యాఖ్యానించింది. కనీస ప్రామాణికాలపై రాజీ పడకూడదని జస్టిస్ కాంత్ స్పష్టం చేశారు. వింగ్ కమాండర్ నికిత తరపున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి మాట్లాడుతూ, తన క్లయింట్ నిపుణురాలైన ఫ్లైట్ కంట్రోలర్ అని, 13.5 ఏళ్లకు పైగా సేవలందించారని, 2019లో తీసుకువచ్చిన విధానం వల్ల ఆమెకు శాశ్వత కమిషన్ నిరాకరించబడిందని చెప్పారు. ఆమెకు ఎందుకు శాశ్వత కమిషన్ ఇవ్వలేదో కారణం చెప్పాలని బెంచ్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి ప్రశ్నించింది. పిటిషనర్‌ను అనర్హురాలిగా సెలక్షన్ బోర్డు పేర్కొందని ఆమె చెప్పారు. ఆమె కేసును రెండవ సెలక్షన్ బోర్డు పరిశీలిస్తుందని చెప్పారు. మహిళా అధికారి కూడా ఎక్కడా ఎలాంటి విజ్ఞప్తి చేయకుండా నేరుగా సుప్రీంను ఆశ్రయించారని తెలిపారు.

మృతదేహాలు అప్పగించేలా ఆదేశాలివ్వండి

- ఎన్‌కౌంటర్ ఘటనపై హైకోర్టులో పిటిషన్లు

ప్రజాశక్తి-అమరావతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన తన కొడుకు, సోదరుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ మృతదేహాన్ని తమకు అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ నంబాల భారతమ్మ, నంబాల ఢిల్లేశ్వరరావు శుక్రవారం హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన తన సోదరుడు సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ రాజన్న మృతదేహాన్ని తమకు అప్పగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సజ్జా శ్రీనివాసరావు, ఇతరులు కూడా అత్యవసరంగా హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం శనివారం విచారణ చేయనుంది. 'ఈ నెల 21న నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిందని, నంబాల కేశవరావు మరణించారని పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహం కోసం ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. అధికారుల చర్యలు అనుమానాలకు తావిస్తోంది. నిజానికి అది బూటకపు ఎన్‌కౌంటర్. కాబట్టే మృతదేహాన్ని అప్పగించడం లేదు. మృతదేహాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తుంటే, యాంటీ నక్సల్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ మోహనరావు మొబైల్ నుంచి శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి మాట్లాడారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దన్నారు. పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నా మరో సోదరుడు ఈ నెల 21న జబల్‌పూర్ వెళ్లారు. మృతదేహాన్ని అప్పగించకపోగా బెదిరింపు వైఖరితో మాట్లాడారు. ఎపి సరిహద్దు వరకు మృతదేహాన్ని అప్పగించేందుకు అధికారులు నిరాకరించారు' అని ఢిల్లేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 196 ప్రకారం పోలీస్ కస్టడీలో మృతి చెందితే ఈ ఘటనపై మెజిస్ట్రేట్ స్వతంత్రంగా విచారణ చేయాలి. విచారణకు మృతుడి కుటుంబ సభ్యులను అనుమతించాలి. మరణించిన 24 గంటల్లోపు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సివిల్ సర్జన్ పరిశీలన చేయించాలి. అయితే అధికారులు మృతదేహాల్ని అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారు. శ్రీకాకుళం ఎస్‌పి.. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు పూర్తిస్థాయిలో వత్తాసు పలుకుతున్నారు. మృతదేహాల పట్ల కూడా హుందాగా పోలీసులు వ్యవహరించడం లేదు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులకు అనుమతినివ్వాలి. గత్యంతరం లేక హైకోర్టుకు వచ్చాం. నా సోదరుడి మృతదేహాన్ని అప్పగించేలా ఆదేశాలివ్వండి. అప్పటి వరకు మృతదేహాన్ని భద్రం చేసేలా ఉత్తర్వులివ్వండి' అని నంబాల ఢిల్లేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'సజ్జా వెంకట నాగేశ్వరరావు మృతదేహాన్ని అప్పగించేందుకు పోలీసులు నిరాకరించడం రాజ్యాంగ వ్యతిరేకం. మృతదేహాన్ని అప్పగించకపోవడానికి కారణాలను చెప్పడం లేదు. గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వర్తించాలి. రాజ్యాంగం కల్పించిన హక్కు. చివరి ప్రయాణం కూడా అడ్డుకోవడం అన్యాయం. వెంటనే మృతదేహాన్ని అప్పగించేలా ఉత్తర్వులివ్వండి. అధికారులు తమ బాధ్యతలను నిర్వహించేలా ఆదేశాలివ్వండి' అని నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు, ఆయన సంబంధీకులు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

తీవ్రవాదంపై పోరులో అండగా వుంటాం!

- భారత్‌కు రష్యా సంఘీభావం
- మాస్కోలో కనిమొళి బృందం వరుస భేటీలు

మాస్కో : తీవ్రవాదంపై భారత్ సాగించే పోరాటానికి తమ మద్దతు, తోడ్పాటు వుంటుందని రష్యా స్పష్టం చేసింది. భారత ప్రభుత్వం చేపట్టే చర్యలకు సంఘీభావాన్ని ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్‌పై, పాక్ ప్రేరేపిత తీవ్రవాదంపై ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత్ నుండి బయలుదేరిన ఏడు అఖిల పక్ష ప్రతినిధి బృందాల్లో భాగంగా కనిమొళి నేతృత్వంలోని ఎంపీల బృందం గురువారం రాత్రి మాస్కో చేరుకుంది. శుక్రవారం రష్యా పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో భారత బృందం చర్చలు జరిపింది. అంతకుముందు అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ మొదటి డిప్యూటీ ఛైర్మన్ ఆండ్రీ డెనిసవ్, ఇతర సెనెటర్లతో చర్చలు జరిగినట్లు మాస్కోలోని భారత ఎంబసీ కార్యాలయం తెలిపింది.



రష్యా అధికారులతో చర్చలు జరుపుతున్న కనిమొళి బృందం

పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారికి సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. డ్యూమా ఛైర్మన్, సమావేశంలో పాల్గొన్న ఇతర సభ్యులు అందరూ సంతాపాలు తెలియజేశారని స్టేట్ డ్యూమా అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ లియోనిద్ స్లుత్స్కీ తెలిపారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వారందరికీ త్వరలోనే తగిన శిక్ష పడాలని ఆయన పేర్కొన్నారు. రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారులతో, స్థానిక మేధావుల బృందంతో కూడా భారత బృందం చర్చలు జరపనుంది. సమావేశంలో ఎంపి కనిమొళి మాట్లాడుతూ, ఈ ప్రతినిధి బృందంలో పాలక, ప్రతిపక్షాల సభ్యులు వున్నారని, వివిధ అంశాలపై తమ అభిప్రాయాలు వేర్వేరుగా వుండవచ్చని, దేశానికి సంబంధించిన విషయాల్లో అందరమూ ఏకతాటిపై నిలబడతామని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో తామంతా ఒక్కటేనన్నారు. రష్యాతో భారత్‌కు సుదీర్ఘ సంబంధాలున్నాయని, ఈ ప్రతినిధి బృందం ఆ సంబంధాలను మరో అడుగు ముందుకు తీసుకెళుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆ రకంగా చర్చలను కొనసాగిస్తామన్నారు.

ఉగ్రవాదంపై భారత్ సాగించే పోరాటానికి రష్యా అండగా వుంటుందని అధ్యక్షుడు పుతిన్ ఇంతకుముందే స్పష్టం చేశారు. పహల్గాం దాడి తర్వాత ఈ నెల ఆరంభంలో భారత ప్రధానికి ఫోన్ చేసిన పుతిన్ దాడి వివరాలను తెలుసుకుని, తీవ్రంగా ఖండించారు. రష్యా, భారత్ వ్యూహాత్మక సంబంధాలు ప్రత్యేక భాగస్వామ్యాన్ని కలిగి వున్నాయని ఇరువురు నేతలు స్పష్టం చేసినట్లు క్రెమ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొంది. వెలుపల నుండి తలెత్తే ప్రభావాలకు ఈ సంబంధాలు చెక్కుచెదరవని, అన్ని దిశల్లోనూ అభివృద్ధి చెందుతునే వుంటాయని ఆ ప్రకటన పేర్కొంది.

గాల్లో విమానం చక్కర్లు!

కనిమొళి నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం రాత్రి కాసేపు మాస్కో గగనతలంపై చక్కర్లు కొట్టింది. డ్రోన్ దాడి జరగడంతో ఆకాశంలోనే విన్యాసాలు చేసిన విమానం దాదాపు 45 నిముషాలు ఆలస్యంగా ల్యాండ్ అయింది. ఈ డ్రోన్ దాడి కారణంగా మాస్కో విమానాశ్రయంలో పలు విమానాలు నిలిచిపోయాయి. భారత రాయబారి వినయ్ కుమార్, ఇతర అధికారులు కనిమొళి బృందానికి సాదర స్వాగతం పలికారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గోపీమూర్తి

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకం చట్టం చేయాలి

- ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు)

షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, జిఒ నంబర్ 3 స్థానంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని ఎమ్మెల్సీ గోపీమూర్తి డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని, మెగా డిఎస్‌సి-2025లో నోటిపై చేసిన షెడ్యూల్డ్ ప్రాంత ఉపాధ్యాయ ఖాళీలను మినహాయించి షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఎపి ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం తొమ్మిదో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏజెన్సీలో స్థానిక అభ్యర్థులను నియమించడం వల్ల విద్యార్థులకు విద్యాబోధన సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే మండలిలో ఈ అంశం ప్రస్తావించానని, భవిష్యత్తు ఆందోళనలకూ మద్దతు ఇస్తానని తెలిపారు.


కరోనా వ్యాప్తి చెందకుండా చర్యలు

- వైద్యారోగ్యశాఖ మంత్రికి ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరోనా వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి త్వరగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖను ప్రజారోగ్యవేదిక కోరింది. ఈ మేరకు వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుక్రవారం లేఖ రాశారు. ప్రసార మాధ్యమాల సమాచారం ప్రకారం.. విశాఖపట్నంలో గురువారం కరోనా కేసు నిర్ధారణ కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కరోనాతో రాష్ట్రానికి గతంలో ఉన్న అనుభవం ప్రకారం ఈ వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, తద్వారా గణనీయమైన సవాలు ఎదుర్కోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గత అనుభవాల ఆధారంగా వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కేసులను వేరుచేయడం, కాంటాక్ట్ ట్రేసింగ్, ప్రభావిత ప్రాంతాల్లో ఆంక్షలు వంటి నివారణ చర్యలు అమలు చేయాలని తెలిపారు. కరోనా లక్షణాలు, మాస్క్ వంటి నివారణ వ్యూహాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అన్ని జిల్లాల్లో అవగాహన ప్రచారాలను ప్రారంభించాలని కోరారు. అన్ని జిల్లాల్లోని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, తగినంత మందుల నిల్వలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, మాస్కులు, పరీక్షలు, పిపిఇ కిట్లతో సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్రంలో కరోనా తిరిగి రాకుండా నిరోధించడానికి సమన్వయంతో కూడిన చర్య చాలా కీలకమని, ఈ ప్రయత్నాల్లో సహాయం చేయడానికి తమ వేదిక సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సత్వర ప్రతిస్పందన, నిర్ణయాత్మక చర్య కోసం తాము ఎదురుచూస్తున్నామని తెలిపారు.

తాత సాయం



గోపాలపురంలో రాము, సోము అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. రాము ఎవరిని చూసినా మంచిగా పలకరిస్తూ వాళ్లకు సహాయం చేస్తాడు. సోము మాత్రం ఎవరికీ సహాయం చేయడు. రాము ఇంటి పక్కనే రాజయ్య అనే ముసలి తాత ఉన్నాడు. తాతకు ఏ అవసరం వచ్చిన రాము సహాయం చేస్తాడు. సోము మాత్రం తాతకు ఏ సాయం చేయడు.

ఒకసారి తాతకి బాగా జ్వరం వచ్చింది. రాము తాతకి మందులు తెచ్చి ఇచ్చాడు. అమ్మని అడిగి వేళకి ఆహారం ఇచ్చాడు. ఇదంతా చూసిన సోము, 'నీకెందుకురా?' ఆ తాత పిల్లలు పక్క ఊళ్లోనే కదా ఉన్నారు. వాళ్లు చూసుకుంటారులే' అన్నాడు. అయినా రాము తన పని తాను చేశాడు.

ఇది ఇలా ఉండగా ఒక రోజు సోము, రాము బడికి వెళ్తుండగా సోము ఊబిలో పడతాడు. అంతకంతకూ లోనికిపోతాడు. రాము వెంటనే అక్కడే ఉన్న ఓ మర్రి ఊడని సోముకి అందించాడు. దాన్ని పట్టుకుని పైకి రమ్మన్నాడు. సోము ఎంత ప్రయత్నించినా బయటికి రాలేదు. ఈ లోపు అటుగా తాత వచ్చాడు. సోము ఊబిలో ఉండడం చూసి చాలా కంగారుపడ్డాడు. ఊడని పట్టుకుని పైకి రావడం సోముకి చేతకావడం లేదని తాతకి అర్థమైంది. వెంటనే మర్రి ఊడని తన నడుముకి చుట్టుకుని నేలపై పడుకుని బలంగా లాగాడు. ఆ ఊపుకి సోము ఊబి నుండి ఒడ్డుకి వచ్చాడు. తాత ఒళ్లంతా గీరుకుపోయి రక్తం వచ్చింది.


తాతని అలా చూసిన సోముకి ఏడుపొచ్చింది. 'తాతా నేనెప్పుడూ నీకు సాయం చేయలేదు. అయినా నన్ను కాపాడావు. నీకు దెబ్బలు తగులుతాయని తెలిసి కూడా నన్ను రక్షించావు. ఇక నుండి నేను కూడా రాములా ఇతరులకు సాయం చేస్తాను' అన్నాడు. సోములో వచ్చిన మార్పుకి రాము ఎంతో సంతోషించాడు.



- జి.సాహిత్య,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాజగోపాల్ పేట,
78429 06949.

బొమ్మల కొలువు









తేజస్విని,
7వ తరగతి,
కర్నూలు సమ్మర్ క్యాంప్,
99633 50973.



సిహెచ్. రిషిత
8వ తరగతి
నారాయణ స్కూల్,
మార్కాపుర్.



మంతెన శ్రీరామ్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ పాలికల ఉన్నత పాఠశాల,
కొండపాక.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సారథం

స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో వేయిసార్లు విఫలమైనా మరొకసారి ప్రయత్నించాలి.

JEEVANA
జీవన the family

బీట్‌రూట్.. ఏది మంచిది!



బీట్‌రూట్ రక్తాన్ని శుద్ధి చేయడంలో, శరీర శక్తిని పెంచడంలో అద్భుతమైన కూరగాయ. ఇది అనేక పోషకాలతో నిండి ఉంటుంది. బీట్‌రూట్ తినడం వల్ల రక్త సరఫరా పెరుగుతుంది. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అంటారు. అయితే, బీట్‌రూట్‌ను పచ్చిగా తినడం మంచిదా లేదా వండుకుని తినడం మంచిదా అనే సందేహం చాలామందికి ఉంటుంది.

రోగనిరోధక శక్తిని పెంచడం, రక్తపోటు, రక్త ప్రసరణను మెరుగుపరచడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను బీట్‌రూట్ అందిస్తుంది. ఇందులో ఫోలేట్ (విటమిన్ బి9), ఐరన్, పొటాషియం, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇవి రక్త ఆరోగ్యానికి తోడ్పడతాయి. రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.

బీట్‌రూట్‌లో పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, ఐరన్ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఫోలేట్ అధికంగా ఉండే ఆహారం గుండె సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. 2021లో నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన ఒక అధ్యయనంలో ప్రతిరోజూ పచ్చి బీట్‌రూట్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించారు.

దీని ప్రకారం, రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గాయి. కాలేయ ఎంజైమ్‌లు హెూమోసిస్టీన్, అపోలిపోప్రొటీన్ బి100 స్థాయిలు తగ్గాయి. యాంటీఆక్సిడెంట్ సామర్థ్యం పెరిగింది. రక్తపోటు, మెదడు పనితీరు మెరుగుపడింది. అదనంగా, ఇది టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రించడం లో కూడా సహాయపడింది. అయితే, కొంతమంది నిపుణులు ఉడికించిన బీట్‌రూట్‌ను ఉప్పుతో కలిపి తినడం కూడా ఆరోగ్యకరమైనదని అంటున్నారు.

పచ్చి బీట్‌రూట్‌లో : పోషక విలువలు (ప్రతి 100 (గ్రాములకు) కేలరీలు - 43, కార్బోహైడ్రేట్లు - 9.6 గ్రాములు, ఫైబర్ - 2.8 గ్రాములు, చక్కెర - 6.8 గ్రాములు, ప్రోటీన్ - 1.6 గ్రాములు, కొవ్వు - 0.2 గ్రాములు, విటమిన్ బి9 - 80- 109 గ్రాములు విటమిన్ సి - 4.9 మి.గ్రా, పొటాషియం - 325 మి.గ్రా, ఐరన్ - 0.8 మి.గ్రా, మెగ్నీషియం - 23 మి.గ్రా ఉంటాయి.

పచ్చి బీట్‌రూట్ ప్రయోజనాలు : ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఫోలేట్ గుండె ఆరోగ్యానికి, కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఉడికించిన బీట్‌రూట్ : పోషక విలువలు (ప్రతి 100 (గ్రాములకు) కేలరీలు - 44, కార్బోహైడ్రేట్లు - 10.0 గ్రాములు, చక్కెరలు - 7.0 గ్రాములు, ఫైబర్ - 2.0 గ్రాములు, ప్రోటీన్ - 1.6 గ్రాములు, కొవ్వు - 0.1 గ్రాములు, విటమిన్ బి9 - 80-100 గ్రాములు, పొటాషియం - 300 గ్రాములు, మాంగనీస్ - 0.3 గ్రాములు, ఐరన్ - 0.8 గ్రాములు.

ఉడికించిన బీట్‌రూట్ ప్రయోజనాలు : ఇందులో పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. వంట చేసేటప్పుడు విటమిన్ సి, కొన్ని యాంటీఆక్సిడెంట్లు పోతాయి. అయితే, ఇందులో ఉండే నైట్రేట్ల కారణంగా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పచ్చి బీట్‌రూట్ ఎక్కువ పోషకమైనది. అయితే, దీన్ని కొద్ది మొత్తంలో నీటిలో కలిపి తినడం ఆరోగ్యకరం.

ఇలా శుభ్రం చేసుకోవచ్చు..



బాత్‌రూంలో వాడే ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులను ఎంత శుభ్రం చేసినా వాటిపై జిడ్డు వదలదు. సబ్బు, నీటి వాడకం వల్ల ఏర్పడ్డ ఈ జిడ్డు, తెల్లటి పూతలా పేరుకుపోతుంటుంది. అయితే, కొన్ని సులభమైన పద్ధతులతో ఈ బకెట్లు, మగ్గులను నిమిషాల్లో శుభ్రం చేసుకోవచ్చు.

బేకింగ్ సోడా, వెనిగర్ : బాత్‌రూం బకెట్లు, మగ్గులను శుభ్రం చేయడానికి బేకింగ్ సోడా, వెనిగర్‌ను ఉపయోగించవచ్చు. దీని కోసం, బేకింగ్ సోడాలో వెనిగర్‌ను కలిపి పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ పేస్ట్‌ను బకెట్, మగ్గు లోపల, బయట బాగా పూయాలి. ఆ తర్వాత ఒక స్క్రబ్బర్‌తో రుద్ది, శుభ్రమైన నీటితో కడిగితే జిడ్డు వదులుతుంది.

నిమ్మకాయ, సబ్బు : నిమ్మకాయను సబ్బుతో కలిపి ఉపయోగించినా, ఫలితం ఉంటుంది. దీని కోసం, సబ్బు ద్రావణంలో నిమ్మరసం, కొద్దిగా నీటిని కలిపి ఒక మిశ్రమాన్ని తయారు చేయాలి. ఇప్పుడు బకెట్, మగ్గుకు ఈ మిశ్రమాన్ని రాయాలి. కాసేపటి తర్వాత బ్రష్‌తో రుద్ది, శుభ్రమైన నీటితో కడగాలి. దీనివల్ల బకెట్, మగ్గులపై ఉన్న నల్లదనం మాయమైపోతుంది.

బ్లీచ్ పౌడర్ : బాత్‌రూంను శుభ్రం చేయడానికి బ్లీచ్ పౌడర్‌ను ఉపయోగిస్తుంటారు. అదే విధంగా, బాత్‌రూంలో ఉంచిన బకెట్లు, మగ్గులకు కూడా ఈ పౌడర్‌ను వినియోగించవచ్చు. దీని కోసం, 1 కప్పు బ్లీచ్ పౌడర్‌ను నీటిలో కలిపి పేస్ట్ తయారు చేయాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ను బకెట్, మగ్గుపై పూయాలి. ఆ తర్వాత తేలికగా రుద్ది కడగాలి. ఇలా చేస్తే బకెట్, మగ్గు శుభ్రపడతాయి.

హైడ్రోజన్ పెరాక్సైడ్ : బకెట్లు, మగ్గులను శుభ్రం చేయడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ కూడా ఉపయోగించవచ్చు. దీని కోసం, హైడ్రోజన్ పెరాక్సైడ్‌లో నీటిని కలిపి ఒక ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణాన్ని జిడ్డుపై పూసి, శుభ్రం చేస్తే మరకలు వదులుతాయి.

డిష్ సోప్ : డిష్ సోప్‌ను ఉపయోగించి కూడా బకెట్లు, మగ్గులకు మంచి క్లీనర్‌ను తయారు చేయవచ్చు. దీని కోసం, డిష్ సోప్‌లో బేకింగ్ సోడా, నిమ్మరసం కలిపి పేస్ట్ తయారు చేయాలి. ఈ పేస్ట్‌ను బకెట్, మగ్గుపై పూసి, 5-10 నిమిషాల తర్వాత, శుభ్రం చేయాలి.

రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ కొత్త సినిమా!




దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ రూపొందించిన 'గుంటూరు కారం' (2024) సినిమా విడుదలై ఏడాదిన్నర దాటింది. కొత్త సినిమాపై ఇంకా స్పష్టత లేకపోవడం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. మొదట్లో అల్లు అర్జున్‌తో పాన్‌ఇండియా చిత్రం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ, అది వర్కౌట్ కాలేదు. ప్రస్తుతం అల్లు అర్జున్.. తమిళ దర్శకుడు అట్లీతో ఓ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్టు 2026 వరకు పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో, త్రివిక్రమ్ సినిమా తాత్కాలికంగా వాయిదా పడినట్లు మొన్నటిదాక ప్రచారం జరిగింది. ఇప్పుడు మొత్తానికి ఈ చిత్రం ఉండకపోవచ్చని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. బన్నీ ప్రాజెక్ట్‌ని పక్కకు పెట్టి రామ్‌చరణ్‌తో పాన్ ఇండియా సినిమా చేసేందుకు త్రివిక్రమ్ సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. కథానాయకుడు వెంకటేష్‌తో ఓ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించేందుకు సిద్ధమైనా సెట్స్‌పైకి రానుందనే సమయంలో అది కూడా పక్కన పెట్టేసినట్లుగా తెలిసింది. రామ్‌చరణ్‌తో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం. పవన్ కళ్యాణ్ చొరవతో రామ్‌చరణ్ కోసం త్రివిక్రమ్ ఓ క్రేజీ కథను సిద్ధం చేశారని తెలిసింది. ఇటీవల ఈ కథను చరణ్‌కు చెప్పి ఒప్పించారట. నిర్మాతగా పవన్‌కళ్యాణ్ వ్యవహరించబోతున్నట్లుగా సమాచారం. పెద్ది పూర్తయిన వెంటనే త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. పెద్ది తర్వాత సుకుమార్‌తో రామ్‌చరణ్ సినిమా చేయాల్సివుంది. పవన్‌కళ్యాణ్ జోక్యంతో త్రివిక్రమ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలిసింది.

కె.రాఘవేంద్రరావు పుట్టిన రోజు వేడుకలు



దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు తన పుట్టినరోజు వేడుకలను హైదరాబాద్‌లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు కథానాయకులు, కథానాయికలు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, సినీరంగ ప్రముఖులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్ కూడా ప్రత్యేకంగా కె.రాఘవేంద్రరావుకు శుభాకాంక్షలు తెలిపారు. 'గంగోత్రి' సినిమా ద్వారా అల్లు అర్జున్ టాలీవుడ్‌లో కథానాయకుడిగా అరంగ్రేటం చేసిన విషయం తెలిసిందే. కె.రాఘవేంద్రరావు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. తన కార్యాలయం ప్రవేశ హాలులో కె.రాఘవేంద్రరావు ఫొటోను అల్లు అర్జున్ ఏర్పాటుచేయించారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని ఈ ఫొటోను సోషల్‌మీడియాలో షేర్‌చేశారు.



సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'ఘటికాచలం' ట్రైలర్

తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన సినిమాలు ఒక్కోసారి సూపర్ హిట్ అందుకుని అందరి అంచనాలకు మించి కలెక్షన్స్ రాబడుతాయి. అలాంటి అంచనాలతో వస్తున్న చిత్రం 'ఘటికాచలం'.. తాజాగా ఈ మూవీ నుంచి ట్రైలర్ విడుదలైంది. మంచి గ్రిప్పింగ్ కాన్సెప్ట్‌తో సినిమాను తెరకెక్కించినట్లుగా ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతోంది. ఇంటెన్స్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రానున్న ఈ మూవీలో నిఖిల్ దేవాదుల, సమ్యు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించారు. అమర్ కామేపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాకర్, ఆర్విකా గుప్తా, జోగి నాయుడు, సంజయ్ రాయ్ చుర, దుర్గాదేవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఎంసీ రాజు కథ అందించారు. ఈ చిత్రానికి ఫేవియో సంగీతాన్ని అందించారు. ఈనెల 31న ఈ చిత్రం విడుదల కానుంది.



'థగ్‌లైఫ్'లో 'నాయకుడు'ను చూస్తారు
మణిరత్నం

'కమల్‌హాసన్‌తో మొదటిసారి 'నాయకుడు' సినిమా చేశాను. 'మౌనరాగం' పూర్తయిన తర్వాత ఇంట్లో కూర్చుని ఉన్నా. నిర్మాత ముక్తా శ్రీనివాసన్ వచ్చి ఓ హిందీ సినిమా క్యాసెట్ చేతిలో పెట్టి తమిళ్‌లో చేయాలని చెప్పారు. నాకు రీమేక్ చేసే ఉద్దేశ్యం లేదని చెప్పా. అయితే ఈ విషయాన్ని కమల్‌హాసన్‌కు చెప్పమన్నారు. నేను వెళ్లి ఆయనకు అదే చెప్పాను. అయితే నువ్వేం చేయాలనుకుంటున్నావో ఆ సినిమా చేద్దాం అని చెప్పారు. అలా 'నాయకుడు' వచ్చింది. ఈ సినిమా కూడా అలాగే జరిగింది. కాల్ చేసి ఇద్దరం కలిసి ఒక సినిమా చేద్దామని చెప్పారు. అలా ఈ సినిమా జర్నీ మొదలైంది. ఆయనతో ఇన్నేళ్ల తర్వాత సెకండ్ సినిమా అవకాశం రావటం ఆనందంగా ఉంది. ఆయనతో వర్క్ చేయడం మధురానుభూతిగా ఉంటుంది. 'నాయకుడు' సినిమా సమయంలో ఎలా ఉన్నారో...ఇప్పుడు కూడా అలానే ఉన్నారు. నేను డైరెక్టర్ కాకముందు నుంచి ఆయన్ని చూస్తున్నాను. ఆయనలో ఏ మార్పు లేదు. ఆయన దర్శకుడు ఏమనుకుంటున్నాడో దాన్ని అర్థం చేసుకుని సపోర్టు చేస్తారు' అని దర్శకుడు మణిరత్నం అన్నారు. కమల్‌హాసన్, త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'థగ్‌లైఫ్'. మణిరత్నం దర్శకుడు. జూన్ 5వ ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ఇతర ప్రచార కార్యక్రమాలకు పాన్ ఇండియాస్థాయిలో గుర్తింపు వస్తోంది. ఎన్.సుధాకర్‌రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మణిరత్నం, కమల్‌హాసన్, సుహాసిని, నాజర్, త్రిష, శింబు తదితరులు మాట్లాడారు.

సెమీస్‌కు శ్రీకాంత్

- క్వార్టర్‌ఫైనల్లో ఉత్కంఠ విజయం
- మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్



కౌలాలంపూర్ : కిదాంబి శ్రీకాంత్ చాన్నాండ్ల తర్వాత మళ్లీ గెలుపు బాట పట్టాడు. మలేషియా మాస్టర్స్‌లో అద్భుతంగా రాణిస్తున్న కిదాంబి శ్రీకాంత్ కౌలాలంపూర్‌లో ఇప్పటికే వరుసగా ఐదు మ్యాచుల్లో విజయాలు నమోదు చేశాడు. ఫ్రాన్స్ ఆటగాడిపై విజయంతో పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించిన కిదాంబి శ్రీకాంత్.. 2023 తర్వాత తొలిసారి ఓ టోర్నమెంట్ టాప్-4లో నిలిచాడు.

కౌలాలంపూర్ : భారత వెటరన్ షట్లర్, పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2023 తర్వాత తొలిసారి ఓ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ ఏడాది థాయ్‌లాండ్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్న శ్రీకాంత్.. 2023లో స్విస్, మకావు ఓపెన్‌లో సెమీస్‌కు చేరుకున్నాడు. కౌలాలంపూర్ స్పోర్ట్స్ సిటీలో జరుగుతున్న మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో మెరిసిన శ్రీకాంత్ మళ్లీ సెమీఫైనల్లో కాలుమోపాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ ఆటగాడు టోమ జూనియర్‌పై మూడు గేముల మ్యాచ్‌లో శ్రీకాంత్ గెలుపొందాడు. 74 నిమిషాల పాటు ఉత్కంఠ సాగిన మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 24-22, 17-21, 22-20తో పైచేయి సాధించాడు. గతంలో రెండు సార్లు టోమ చేతిలో ఓడిన శ్రీకాంత్.. మలేషియా మాస్టర్స్‌లో అతడికే చుక్కలు చూపించాడు.

తొలి గేమ్‌లో 10-11తో విరామ సమయానికి ఓ పాయింట్ వెనుకంజ వేసిన శ్రీకాంత్ ద్వితీయార్థంలో పుంజుకున్నాడు. ప్రతి పాయింట్‌కు ఆధిక్యం చేతులు మారిన మ్యాచ్‌లో 22-22 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగింది. ఆఖర్లో వరుసగా రెండు పాయింట్లు సాధించిన శ్రీకాంత్ తొలి గేమ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెండో గేమ్‌ను టోమ 21-17తో గెల్చుకుని లెక్క సమం చేశాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ సైతం ఉత్కంఠ రేపింది. విరామ సమయానికి 7-11తో తడబాటుకు గురైన శ్రీకాంత్.. ఆ తర్వాత గొప్పగా పుంజుకున్నాడు. వరుస పాయింట్లతో 13-13తో స్కోరు సమం చేశాడు. 18-17, 20-17తో శ్రీకాంత్ ముందంజ వేసినా.. టోమ 20-20తో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చాడు. ఒత్తిడిలో ఉత్తమ ప్రదర్శన చేసిన కిదాంబి శ్రీకాంత్ మరోసారి టైబ్రేకర్‌లో పైచేయి సాధించాడు. 22-20తో మూడో గేమ్‌తో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో జపాన్ షట్లర్ టనకతో పోటీపడనున్నాడు. ఇదిలా ఉండగా, మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు వరుస గేముల్లో ఓటమి చెందారు. 22-24, 13-21తో టాప్ సీడ్ చైనా షట్లర్ల చేతిలో పరాజయం పాలయ్యారు. దీంతో మలేషియా మాస్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్ ఒక్కడే భారత టైటిల్ ఆశల భారం మోస్తున్నాడు.

ఇషాన్ సూపర్ ఇన్నింగ్స్..

- బెంగుళూరు ఆశలను చిత్తు చేసిన హైదరాబాద్
- ఆర్సీబీపై 42 పరుగుల తేడాతో విజయం



లక్నో : ఇషాన్ సూపర్ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్-2025లో పాయింట్ల టేబుల్‌లో టాప్‌కి చేరాలనే బెంగుళూరు ఆశలను హైదరాబాద్ చిత్తు చేసింది. లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీపై 42 పరుగుల తేడాతో ఎస్‌ఆర్‌హెచ్ విజయం సాధించింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ఆర్సీబీ మూడో స్థానానికి పడిపోయింది. టాప్-2లో గుజరాత్,పంజాబ్ కొనసాగుతున్నాయి. 232 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఆర్సీబీ బ్యాటర్లలో ఫిల్ సాల్ట్(62), విరాట్ కోహ్లి(43) అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికి మిడిలార్డర్ బ్యాటర్లు మయాంక్ అగర్వాల్ (11), రజత్ పటీదార్ (18), రొమారియో షెఫర్డ్ (0), టిమ్ డేవిడ్ (1) విఫలం కావడం బెంగళూరును దెబ్బతీసింది. కృనాల్ పాండ్య (8), భువనేశ్వర్ (3), యశ్ దయాల్ (3) త్వరగానే పెవిలియన్‌కు చేరారు. ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లలో ప్యాట్ కమ్మిన్స్ మూడు వికెట్లు పడగొట్టగా.. ఇషాన్ మలింగ రెండు, ఉనద్కట్, దూబే, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్ తలా వికెట్ సాధించారు.

అంతకు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 48 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో కిషన్ 94 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ (17 బంతుల్లో 34 పరుగులుబీ 3 ఫోర్లు, 3 సిక్సర్లు), ట్రావిస్ హెడ్ (10 బంతుల్లో 17 పరుగులు 3 ఫోర్లు) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. కేవలం 3.3 ఓవర్లలోనే వీరు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అభిషేక్ శర్మ ఎంగిడీ బౌలింగ్‌లో, ఆ వెంటనే హెడ్ భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యారు. ఇక వన్‌డౌన్‌లో వచ్చిన క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హెన్రిచ్ క్లాసెన్ (24 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. క్లాసెన్ అవుటైన తర్వాత వచ్చిన అనికేత్ వర్మ (9 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 26 పరుగులు) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడి కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు ఇషాన్ కిషన్ తనదైన శైలిలో పరుగులు రాబడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 28 బంతుల్లోనే అర్థశతకం పూర్తి చేసుకున్నాడు. నితీష్ కుమార్ రెడ్డి (4), అభినవ్ మనోహర్ (12) త్వరగానే అవుటైనా, కెప్టెన్ పాట్ కమిన్స్ (13 నాటౌట్ 6 బంతుల్లో 1 సిక్సర్)తో కలిసి ఇషాన్ కిషన్ చివరి వరకు క్రీజులో నిలిచి జట్టు స్కోరును 230 పరుగులు దాటించారు. ఆర్‌సిబి బౌలర్లలో రొమారియో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టగా.. సుయాష్, ఎంగిడీ,భువనేశ్వర్, కృనాల్ పాండ్యా తలా వికెట్ సాధించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68